నమ్మలేని నిజాలు

ఆకలి పొట్లు
తిండిలో పురుగులు
బడి భోజనం
తూట సంస్కృతి
విదేశ హింసా శ్రుతి
మనదే శాంతి
పిడుగు పాట్లు
జీవుల చావుగీతం
నాటండి చెట్లు
రష్యా పై పగ
మనకు టారీఫులు
ఇద్దరు క్షేమం
రూక బేజారు
పుంజుకున్న డాలరు
ధరల సెగ



- రేడియమ్
సెల్: 9291527757


# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com


శ్రీనిజాలు

జూబ్లీహిల్స్ అసెంబ్లీది
ఉప ఎన్నిక హీటెక్కెను !
మెజారిటీ ఓట్లతోటి
ఏ పార్టీ సీటెక్కును ?
మూడు పార్టీల గెలుపుకు
ఇదో ప్రతిష్టాత్మకమైంది !
బట్టకట్టి నిలబడుటకు
భలే అగ్ని పరీక్ష ఇది !



- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

హైదరాబాద్ గురువారం 30-10-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 ▪ Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:59 పేజీలు:6 వెల: రూ.1/-

# మొంథా తుఫాన్ ఎఫెక్ట్.. తెలుగు రాష్ట్రాలు అతలాకుతలం



హైదరాబాద్, అక్టోబర్ 29: తెలుగు రాష్ట్రాలకు మరో ముప్పు పొంచి ఉంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు ఫ్లాష్ ఫ్లడ్ వచ్చే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ(ఎఓఆ)హెచ్చరికలు జారీ చేసింది. ఏపీ, తెలంగాణతో పాటు మహారాష్ట్ర, విదర్భా ప్రాంతాలకు రాబోయే కొన్ని గంటల్లో తక్షణ వరద ముప్పు పొంచి ఉందని ఐఎండీ ప్రకటించింది. నగరంలోని పలు ప్రాంతాల్లో తెల్లవారుజాము నుంచి భారీ వర్షం కురుస్తోంది. ఈ నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి ఆదేశించారు. నగరంలో కురుస్తున్న వర్షం వల్ల ప్రజలకు ఇబ్బంది లేకుండా అన్ని రకాల ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. తరచూ.. సీవరేజీ ఓవర్ ఫ్లో అయ్యే మ్యాన్ హోల్స్ గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు. ముంపునకు గురైన ప్రాంతాల్లో మ్యాన్‌హోల్స్ దగ్గర హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. డీప్ మ్యాన్‌హోల్స్ దగ్గర సీవరేజి సూపర్‌వైజర్లు ఉండేలా ఆదేశాలు జారీ చేశారు.

నగర ప్రజలు ఎలాంటి పరిస్థితుల్లోనూ మ్యాన్‌హోల్స్ మూతలను తెరవకూడదని అశోక్ రెడ్డి సూచించారు. ఎమర్జెన్సీ కోసం జలమండలి హెల్ప్ లైన్ 155313కి కాల్ చేయాలని ఆయన కోరారు. జంట జలాశయాల గేట్లు ఎత్తిన నేపథ్యంలో జలమండలి అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కాగా, మొంథా తుఫాన్ ప్రభావం కారణంగా తెలంగాణలోని పలు చోట్ల భారీ వర్షాలు కురుస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే నగరంలో గత కొన్ని రోజులుగా వర్షాలు పడుతున్నాయి.

హైదరాబాద్ నగరంలో కురుస్తున్న భారీ వర్షాలతో ప్రజలు అతలాకుతలం అవుతున్నారు. వర్షాలతో రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్నాయి. మ్యాన్‌హోల్స్ పొంగిపొర్లుతున్నాయి. పలు కాలనీలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.



గచ్చిబౌలి, ఖాజాగూడ, నానక్‌రాంగూడ, ముషీరాబాద్, ఆర్టీసీ క్రాస్ రోడ్స్, గాంధీనగర్, కవాడిగూడ, మహేశ్వరం, తుక్కుగూడ, భోలక్‌పూర్, అంబర్‌పేట, కాచిగూడ, పహాడీషరీఫ్, జవహర్‌నగర్, నల్లకుంట, బర్కత్‌పురా, బీఎన్‌రెడ్డినగర్, చిక్కడపల్లి, బాగ్‌లింగంపల్లి, మీర్‌పేట్, బాలాపూర్, బడంగ్‌పేట్, దోమలగూడలో వర్షం కురుస్తోంది. నగర వ్యాప్తంగా భారీ వర్షం కురుస్తుండటంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

## భద్రాచలం సమీపంలో వాయుగుండం..
## పలు జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో అలర్ట్ జారీ

ఖమ్మం, అక్టోబర్ 15:మొంథా తీవ్ర తుపాను గత రాత్రి కాకినాడకు దక్షిణంగా నరసాపూర్‌కు సమీపంలో తీరం దాటిందని వాతావరణ శాఖ తెలిపింది. ఉత్తర వాయువ్యదిశగా పయనిస్తూ క్రమంగా బలహీనపడి తీవ్ర వాయుగుండంగా మారి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలను ఆనుకొని భద్రాచలం సమీపంలో కొనసాగుతుందని పేర్కొంది. దీని ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో పలు చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు పడతాయని స్పష్టం చేసింది. బుధవారం భారీ వర్షాలు పడుతాయని ఎన్టీఆర్, పల్నాడు, ప్రకాశం, నంద్యాల జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖ, అల్లూరి, అనకాపల్లి, ఏలూరు, పశ్చిమగోదావరి, గుంటూరు, బాపట్ల, కర్నూలు, కడప, నెల్లూరు జిల్లాలకు ఎల్లో అలర్ట్ ప్రకటించింది.

కోస్తా జిల్లాల్లో గంటకు 60 నుంచి 70 గరిష్టంగా 80 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని వెల్లడించింది. తీరం వెంబడి గంటకు 45 నుంచి 55 గరిష్టంగా 65 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని తెలిపింది. మత్స్యకారులు ఈరోజు, రేపు చేపల వేటకు వెళ్లారాదని వాతావరణ శాఖ హెచ్చరించింది. రాష్ట్రంలో అన్ని పోర్టులలో మూడవ నెంబర్ ప్రమాద హెచ్చరిక జారీ చేసింది. పల్నాడు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ఆకస్మిక వరదలు వచ్చే అవకాశం ఉందని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. రేపు ఉత్తరాంధ్రలోని అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని వెల్లడించింది.

## వర్షాలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలి సీఎం రేవంత్ రెడ్డి

### – సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు

హైదరాబాద్, అక్టోబర్ 29: (నేటినిజం ప్రతినిధి):మొంథా తుపాన్ ప్రభావంతో రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు తుపాన్ ఎఫెక్ట్‌పై సంబంధిత అధికారులతో బుధవారం ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో వరిధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాల్లో రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల్లో అధిక ప్రభావం ఉందని చెప్పారు. రైళ్లు నిలిచిపోవడంతో ప్రయాణికులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. రెవెన్యూ, విద్యుత్, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ, వైద్యారోగ్య, పోలీస్, అగ్నిమాపక శాఖలు, ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది సమన్వయంతో పని చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. హైదరాబాద్ నగరంలో ప్రజల నుంచి వచ్చే వినతులకు జీహెచ్‌ఎంసీ, హైడ్రా, ఎస్‌డీఆర్‌ఎఫ్, అగ్నిమాపక శాఖ సిబ్బంది తక్షణమే స్పందించాలన్నారు.

వరదలో చిక్కుకుపోయిన లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సీఎం ఆదేశించారు. చెరువులు, రిజర్వాయర్ల వద్ద నీటి స్థాయిపై పర్యవేక్షణ కొనసాగించాలన్నారు. నీటితో నిండిన రోడ్లు, కాజ్‌వేలపై రాకపోకల నిషేధం విధించాలని చెప్పారు. వర్షం కారణంగా పేరుకుపోయిన పారిశుద్ధ్య పనులు, దోమల నివారణకు సంబంధించి సీఎం పలు సూచనలు చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా, విషజ్వరాలు వ్యాపించకుండా తగు చర్యలు త్వరితగతిన తీసుకోవాలన్నారు. వైద్యశాఖ మందులు సిద్ధంగా ఉంచి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని.. ఎక్కడా ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు.

నీటి పారుదల శాఖ అధికారులు, సిబ్బంది రిజర్వాయర్లు, చెరువులు, కుంటల నీటి మట్టాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ.. నీటి విడుదలపై



ముందుగానే కలెక్టర్లకు, క్షేత్రస్థాయి సిబ్బందికి సమాచారం ఇవ్వాలని సీఎం సూచించారు. పూర్తిగా నిండిన చెరువులు, రిజర్వాయర్ల వద్ద ఇసుక బస్తాలను ముందుగానే సిద్ధంగా ఉంచాలన్నారు. రోడ్లపై నీరు నిలిచిన ప్రాంతాల్లో, లో లెవల్ బ్రిడ్జీలు, కాజ్‌వేలపై నుంచి రాకపోకలను పూర్తిగా నిషేధించాలని, పోలీసులు, రెవెన్యూ అధికారులు వాటి సమీపంలో బారికేడ్లు ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేయాలని దిశానిర్దేశం చేశారు.

## ప్రధానిగా మోదీ.. బీహార్ సీఎంగా నితీశ్.. ఏ సీటూ ఖాళీగా లేదు : అమిత్ షా

న్యూఢిల్లీ, అక్టోబర్ 29:అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతుండటంతో బీహార్ రాష్ట్రంలో రాజకీయాలు వేడెక్కాయి. ప్రధాన పార్టీలు గెలుపే లక్ష్యంగా ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. ఈ క్రమంలో పార్టీల నేతలు ఒకరిపై ఒకరు తీవ్ర విమర్శలు చేసుకుంటున్నారు. ఇక ప్రతిపక్ష కూటమి మహాగట్‌బంధన్ సీఎం అభ్యర్థిగా తేజస్వీయాదవ్ పేరును ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, ఎన్డీయే కూటమి మాత్రం ఇప్పటి వరకూ సీఎం అభ్యర్థిని ప్రకటించలేదు.

దీంతో ఎన్డీయే కూటమి సీఎం అభ్యర్థి ఎవరన్నదానిపై తీవ్రంగా చర్చ జరుగుతోంది. దీనిపై ప్రతిపక్ష కూటమి పార్టీల నేతలు బీజేపీ, జేడీయూ లక్ష్యంగా విమర్శలకు ఎక్కుపెట్టాయి. ఈ నేపథ్యంలో ప్రతిపక్ష పార్టీల విమర్శలకు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా కౌంటర్ ఇచ్చారు. బీహార్‌లో దర్భంగాలో బుధవారం జరిగిన ర్యాలీలో అమిత్ షా కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు.

ఏ సీటూ ఖాళీగా లేదని వ్యాఖ్యానించారు. కేంద్రంలో ప్రధానిగా నరేంద్రమోదీ ఉంటారన్నారు. బీహార్ ముఖ్యమంత్రిగా నీతీశ్ కుమార్ కొనసాగుతారని స్పష్టం చేశారు. బీహార్ ఎన్నికలు రెండు విడతల్లో జరగనున్న విషయం తెలిసిందే. నవంబర్ 6న తొలి విడత, నవంబర్ 11న రెండో విడత ఎన్నికలు జరగనున్నాయి. నవంబర్ 14న ఓట్ల లెక్కింపు ఉంటుంది.




హైదరాబాద్, అక్టోబర్ 29: మొంథా తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పల్నాడు జిలాఎస్పీ బి. కృష్ణారావు ఆదేశాల మేరకు, ప్రజల ప్రాణరక్షణ మరియు సమాజ శ్రేయస్సును ప్రధాన ధ్యేయంగా తీసుకుని జిల్లా వ్యాప్తంగా పోలీస్ అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్నారు. దీనిలో బాగంగా నిన్నటి(28.10.2025) రోజున కృష్ణా నదిలో చేపలు పట్టుకోడానికి తెలంగాణ సూర్యాపేట జిల్లా, మేళ్లచెరువు మండలం, వెల్లటూరు గ్రామం, చింతలపాలెం, శ్రీరామ్ నగర్ కాలనీకి చెందిన పరసగాని.శ్రీను మత్స్యకారుడు మిషన్ బోటు వేసుకొని తోటి జాలర్లతో కలసి కృష్ణా నదిలోకి చేపల వేటకు వెళ్లాడు.

రాత్రి చేపల వేట ముగించుకొని తిరుగు ప్రయాణంలో తన బోటు చెడిపోయింది. దగ్గరలోని ఒడ్డుకు చేరుకున్నారు. తుఫాను తీవ్రతతో ఎటూ వెళ్లలేక దిక్కుతోచని స్థితిలో ఉన్నాడు. బుధవారం (29.10.2025) ఉదయం బెల్లంకొండ ఎస్సై డి. ప్రవీణ్ కుమార్‌కి అందిన సమాచారంతో జాలర్ల సహాయంతో పరసగాని.శ్రీనును సురక్షితంగా బంధువులకు అప్పగించారు.

## ఢిల్లీలో మేఘ మథనం విఫలం.. ప్రమాదకర స్థాయిలో వాయు కాలుష్యం

న్యూఢిల్లీ, అక్టోబర్ 29: దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరుకుంది. ముఖ్యంగా దీపావళి పండుగ తర్వాత గాలి నాణ్యత క్షీణించింది. వాయు కాలుష్యాన్ని అరికట్టేందుకు ప్రభుత్వం చేపట్టిన 'మేఘ మథనం'విఫలమైన విషయం తెలిసిందే. దీంతో బుధవారం ఉదయం ఢిల్లీలో గాలి నాణ్యత చాలా పేలవమైన విభాగంలో నమోదైంది.

సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న సమాచారం మేరకు.. బుధవారం ఉదయం ఢిల్లీలోని అనేక ప్రాంతాల్లో గాలి నాణ్యత సూచిక 300 కంటే ఎక్కువగానే నమోదైంది. ఆనంద్ విహార్ అబ్జర్వేటరీలో ఏక్యూఐ లెవెల్స్ 312గా నమోదయ్యాయి. ఐటీవో, అక్షర్ ధామ్ వద్ద ఏక్యూఐ 307గా, ఇండిగా గేట్ వద్ద 282గా గాలి నాణ్యత సూచీ నమోదైంది.

వాయు కాలుష్యాన్ని అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే.

## ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్ గేట్లు ఎత్తివేత



హైదరాబాద్, అక్టోబర్ 29:: మొంథా తుఫాను ప్రభావంతో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. నిరంతర వర్షాల కారణంగా, అధికారులు హైదరాబాద్ జంట జలాశయాలైన ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ గేట్లను ఎత్తివేశారు. ఉస్మాన్ సాగర్ 10 గేట్లు ఎత్తి దాదాపు 2,300 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. హిమాయత్ సాగర్ 3 గేట్లు ఎత్తి 2,900 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. జలాశయాల నుంచి విడుదలైన నీటి ప్రవాహం పెరగడంతో నర్సింగా మంచిరేవుల కల్వర్ట్ పై రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశారు. కాచ్మెంట్ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల వలన పెద్దఎత్తున నీరు జలాశయాల్లోకి చేరుతుండటంతో, హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు అధికారులు అప్రమత్తంగా ఉండి మిగులు నీటిని మూసీ నదిలోకి విడుతల చేస్తున్నారు. ప్రజలు మూసీ నది తీర ప్రాంతాలకు వెళ్లరాదు. అధికారుల సూచనలను ఖచ్చితంగా పాటించాలి. నీటి ప్రవాహం ఉన్న రహదారులపైకి వెళ్లరాదు. ఇక హిమాయత్ సాగర్ వద్ద ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్‌లో, ఎగ్జిట్/ఎంట్రీ 17 సమీపంలో రహదారి తీవ్రంగా దెబ్బతింది. సగర్ గేట్లు తెరవడంతో నీటి ప్రవాహం పెరగడంతో రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నట్లు అధికారులు తెలిపారు. వాహనదారులు ఆ మార్గంలో ప్రయాణం చేయకుండా ప్రత్యామ్నాయ మార్గాలను ఉపయోగించాలని హెచ్చరిక జారీ చేశారు.

నివురు గప్పిన నిప్పు

పెరిగిన వ్యతిరేకత
అసంతృప్తి అగుపించదు
కొర్రాయిలా రగులుతూ
నివురు గప్పిన నిప్పులా
అంటుకొంటూ పొగ పెడ్తుంది
కలుగున దాగిన వాటినల్లా
బయటకు రప్పిస్తుంది
మంటలను ఎగదోస్తూ
చలి కాచుకొనేందుకు
మరి కొందరికి పండుగే



-పత్తి శివ ప్రసాద్
9440001224

## మొంథా తుఫాను.. అధికారులు అప్రమత్తంగా ఉండాలి: మంత్రి సీతక్క

హైదరాబాద్, అక్టోబర్ 29: మొంథా తుఫాను నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క) దిశానిర్దేశం చేశారు. తుఫాను పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, అత్యావసర చర్యలకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. మొంథా తుఫానుపై అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా మంత్రి సీతక్క ఇవాళ(బుధవారం) సమీక్షా సమావేశం నిర్వహించారు.

మొంథా తుఫాన్ ప్రభావం తీవ్రంగా ఉన్న మహబూబాబాద్, ములుగు జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులతో మంత్రి సీతక్క మాట్లాడారు. తుఫాను కారణంగా అధికారులు చేపట్టిన చర్యలపై మంత్రి సీతక్క తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులకి కీలక ఆదేశాలు జారీ చేశారు. చలిగాలులు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉంటూ, స్వీయ నియంత్రణ పాటించాలని సూచించారు. రైతులు పంటల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మార్గనిర్దేశం చేశారు. పశువుల కాపరులు తమ పశువులని జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు మంత్రి సీతక్క.

మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని సూచించారు. ప్రజలు వాగులు, చెరువులు దాటే ప్రయత్నం చేయొద్దని, నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు దూరంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. పలు చోట్ల రైళ్లు నిలిచిపోయినట్లు సమాచారం అందుతున్న క్రమంలో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రయాణికులకు ఆహారం, తాగునీరు వంటి అవసరాలు వెంటనే అందించాలని ఆదేశించారు. తుఫాను ప్రభావం తగ్గే వరకు ప్రజలు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలను పాటించాలని, అత్యవసరమైతే తప్పా ఇళ్ల నుంచి బయటకు రావొద్దని మంత్రి సీతక్క సూచించారు.

చురక

నయా ఉదారవాద
నడక భవిత ప్రమాదం
సంపదలో అంతరాలు
చాటుతున్న విషాదం.
విశ్వమంతా పెట్టుబడి
విస్తృతంగా సంచలనం
బలహీన దేశాలను
బంధించే ప్రజ్వలనం



-వేల్పుల నారాయణ
9440433475

## మొంథా తుపాన్ ఎఫెక్ట్.. కూలిన బ్రహ్మంగారి నివాసం

అమరావతి, అక్టోబర్ 29: మొంథా తుపాన్ కారణంగా భారీ వర్షాలకు బ్రహ్మంగారి నివాసం కూలిపోయింది. కడప జిల్లా బ్రహ్మంగారి మఠంలో 16వ శతాబ్దం నాటి ఒక మిద్దె ఉంది. అందులోనే పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి నివసించేవారు. అయితే తుపాన్ ప్రభావంతో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో మట్టి మిద్దె నాని పడిపోయింది. ప్రమాద సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది.

బ్రహ్మంగారు నివసించిన ఈ మిద్దె దాదాపు 350 ఏళ్ల క్రితం నాటిది అని.. మరమ్మతులు చేపట్టకపోవడం వల్లే గోడలతో పాటు పైకప్పు కూలిపోయిందని స్థానికులు చెబుతున్నారు. అతి పురాతనమైన, చారిత్రాత్మక వీరబ్రహ్మేంద్ర స్వామి నివాసం పట్ల అధికారులు, పాలకులు శ్రద్ధ చూపడం లేదని మండిపడ్డారు.

ఈ నేపథ్యంలో మంత్రి నారా లోకేశ్ స్పందించారు. బ్రహ్మంగారి నివాసాన్ని పునరుద్ధరించాలని కడప కలెక్టర్‌ను ఆదేశించారు. మన సాంస్కృతిక వారసత్వంలోని విలువైన సంపదను కాపాడటానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.

రాధశ్రీ రాగాలు

కృతఘ్నతతో తిన్న
యింటి వాసము లెన్న
మానవత్వము సున్న
అనును రాధశ్రీ
నాది నాదనువాడు
వెంట పట్టుకు రాడు
వెంట పట్టుక పోడు
అనును రాధశ్రీ



-రాధశ్రీ
సెల్:9494481210

నేటి నిజం
# సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 30-10-2025

## నానీలు

మనసు మంచిదైతే
మానవత్వం
కుళ్లు బైటపడిందా
కులతత్వం.

స్వాతంత్ర్యం
నిజంగా జన్మహక్కే
మరి పేదలకి
బ్యాడ్ లక్కా!?.

అలరించావా
ఆమె పూలగుత్తి
వేధించావా
అవుతుంది మెత్తని కత్తి.

చిన్నప్పుడు
గుండెలపై ఆడాడు
ఎదిగిన కొడుకు
ఎదపైన తన్నాడు.

ఎన్ని ఇళ్లు కట్టినా
ఏం లాభం
భార్య గుండెలో
గూడు లేకపోయాక.



-డా॥శిరీష
సెల్:98660 50220

## సప్తపదులు

చినుకు
కునుకు

పూరి గుడిసెలో
ఉన్నవారికి
తుపాను వస్తే
ఉండదు కునుకు.

-అడ్డా సత్యవేణి
9494188227

పతివ్రత
విశిష్టత

ఏ పనిచేసిన
సేవాగుణమున్న
మనుష్యులకే
లభిస్తుంది విశిష్టత.

-డా॥జి.శ్రీనివాసాచారి
9490145913

ప్రాణం
రణం

దేశ రక్షణకై
ప్రతిజ్ఞ
ప్రతిఒక్కరి బాధ్యత
అర్పణం.

-కె.కె.తాయారు
9440460797

## మానవీయ ప్రకృతి

గాలికెంత విశాల హృదయం
అలసట లేకుండా
ఎన్ని ఆలోచనలు మోసుకొస్తుంది.
నీటికెంత ద్రవ గుణం
నిరవధిక ఝరిలా
అవతారమెత్తుతూ
తరంగ సందేశాలను
ఒడ్డుకు చేర్చుతుంది.
నిప్పుకెంత నికార్సయిన గుణం
చెడును కాల్చి బూడిద చేస్తూ
మంచికి వజ్రంలా వన్నెలద్దుతుంది.
నేలకెంత అమ్మ గుణం
ఎన్నింటినో కడుపులో పొదువుకొని
సంసార జీవనానికి
కేంద్ర బిందువై భాసిల్లుతుంది.
నింగికెంత నాన్న గుణం
అన్ని దిక్కులకు
తానే ఓ పెద్ద దిక్కై
విశ్వమంతా విస్తరిస్తుంది.
తన ఒళ్ళంతా
పంచభూతాలను పులుముకున్న
ప్రకృతి కాంతకెంత పరవశం
ఘడియ ఘడియకో
నవ్య సృష్టికి పురుడు పోస్తూ
కడు వింతలతో
కను విందు చేయడానికి.



- ఆచార్య
కదారు వీరారెడ్డి
9392447007

## అస్థి సంచయం

నా కొడుకు
బూడిదలోంచి
వాళ్ళమ్మ ఎముకల్ని ఏరుతున్నాడు.
వాటికి ఆమె దేహం వెచ్చదనం
ఇంకా పోలేదు.
అది ఆమెను
కౌగిలించుకొని
పడుకున్న ప్రేమ కాబోలు.
ఆ ఎముకల మధ్యే
వాడి జననం
ఆమె శిరస్సు ఎముకల్లోనే
ఇప్పటికీ నెనరు పుష్పాల పరిమళం.
ఆమె దవడ అస్థికల్లోంచి
వెలువడ్డ జోలపాట
ఇంకా వినిపిస్తూనే వుంది.
ఆమె భుజం ఎముకలమీదే
ఈ యిల్లు నిలిచింది.
కాలి ఎముకల తోటే
వందలాది మైళ్లు నడిచింది.
వాటిని
కన్నీళ్ళతో పాటు
నదిలో కలుపుతున్నాడు.
సముద్రాన్ని చూస్తుంటే
ఆహోరు
ఆమె పిలుస్తున్నట్టే వుంది.



-డా॥ ఎన్. గోపి
సెల్:9391028496



పుస్తకసమీక్ష

# బంధాలు అనుబంధాలతో అనూరాధ కవిత్వం !





"నా సలక్షణమైన అక్షరాలు
మనోఫలకంపై...ఓలలాడే భావతరంగాలు
తిరుగాడే మౌక్తికాలు
వాటికి స్వచ్ఛత తప్ప
ఏ జిత్తులు తెలియవు
నిర్భయంగా నిర్మోహమాటంగా
సంచరించే స్వేచ్ఛాగీతికలు" అంటూ కవయిత్రి డా. శ్రీభాష్యం అనూరాధ గారు తమ తొలి కవితా సంపుటిగా "తనబ్బి"ని వెలువరించారు.

"సమాజాన్ని, విశ్వాన్ని
సంస్కృతిని, సాహిత్యాన్ని
కదిలించే ప్రతి వస్తువు
కవనానికి కదిలే నడత
భావోద్వేగాలు కవితా ధారలై
పండిత పామరులకు కరదీపికలు" అని భావించే శ్రీభాష్యం అనురాధ గారు.. కవి హృదయమే ఓ విజ్ఞాన వేదిక అని చాటి చెబుతూ... బంధాలు.. అనుబంధాలకు ఓ అర్థం... పరమార్థాన్ని తెలియజెబుతూ "తనబ్బి" సంపుటిలోని కవితలకు జీవం పోశారు.

"బంధాలు - అనుబంధాలు - సంబంధాలు" అనే మూడు విభాగాలుగా విభజించుకుని వాటితోనే కవితల్ని రాసి మెప్పించారు.

సభ్యత, సంస్కారం, సదభ్యాసం, వాక్‌శుద్ధి, మంచి నడత వంటి లక్షణాలు మనిషిని మనిషిగా చేస్తాయనీ.. వెలుగునీడల్లా మిట్ట పల్లాల దారిలా.. ఆటుపోట్ల సంద్రంలా, కష్టసుఖాలను అనుభవిస్తూ ముందుకు సాగడమే జీవితమని తేల్చి చెబుతూ ఇందలి కవితలను రూపుదిద్దారు. కవయిత్రి అనూరాధ గారి మనోపేటిక, మనసు మీటిన ప్రతి భావాన్ని కవితాత్మకంగా ప్రకటిస్తూ రాసిన ఈ కవితల్లో.. బంధాలు - అనుబంధాలు - సంబంధాలు ప్రస్ఫుటంగా కానవస్తాయి... నాన్న తన తనబ్బిలో బంధాలను పదిల పరిచిన అంశాలను మొదటి భాగంలో అనుబంధాలను పెంచే విషయాలకు సంబంధించిన వస్తువులు (తినుబండారాలు, ఆహార్యపు అలంకరణలు, దుస్తులు) వంటి అంశాలతో రెండో విభాగాన్ని తీర్చిదిద్దారు - ఇక మూడో విభాగంలో సంబంధీకులతో పెనవేసుకున్న సంబంధ బాంధవ్యాలకు సంబంధించిన వివరాలతో కవితల్ని రాసి ఇందులో పొందుపరిచారు. వృత్తిరీత్యా తెలంగాణ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల డిగ్రీ కళాశాలలో అధ్యాపకు రాలిగా పని చేస్తూ... రచనా వ్యాసంగాన్ని ప్రవృత్తిగా మలచుకుని సాహితీ క్షేత్రాన కవయిత్రిగా తమకంటూ అనూరాధ గారు ఓ స్థానాన్ని పదిల పరుచుకునే ప్రయత్నం చేయడం ప్రశంసనీయం.

'బంధాలు' - విభాగంలో బంధాలను ఆత్మీయంగా అక్షరాల్లో నిక్షిప్తం చేశారు.. స్వార్థభావాలను తుంచావు... ఆత్మస్థైర్యాన్ని పెంచావు... బంధాలను బాధ్యతలను అప్పగించావు అంటూ అమ్మను గుర్తు చేసుకున్నారు.. చిరుదరహాసం పెట్టని 'ఆభరణం' అంటూ అమ్మ వకుళకు అక్షర సుమాలు సమర్పించారు. తమ నాన్నతో పెన వేసుకుని ఉన్న బంధాన్ని ఆవిష్కరిస్తూ "నాన్న తనబ్బి" కవితను తీర్చిదిద్దారు. మా చతుశ్శాల భవంతిలో ముందు గదికే ఓ ఆకర్షణ ఆ తనబ్బి అంటూ... చిన్ననాటి జ్ఞాపకాలను.. ముఖ్యంగా నాన్న 'తనబ్బి' యొక్క ప్రాధాన్యతను తెలియజెప్పారు. 'తనబ్బి' అంటే.. 'అలమార', 'ఓ సెల్ఫ్'గా చెప్పుకోవచ్చు... కవయిత్రి అనూరాధ గారు నాన్న గారు ఉపయోగించిన 'తనబ్బి'ని చక్కగా పరిచయం చేశారు. తనబ్బి పై వున్న తాత నానమ్మ చిత్ర పటాలను, తనబ్బిని తెరవగానే రెక్కలకు రాసిన పిల్లల జాతకాలు... పచ్చ కర్పూరపు పరిమళాలు... పటిక బెల్లం తీసి వాసనలు... జీడిపప్పుల కమ్మని రుచులు... అవి మనుమరాళ్లకు ఆకర్షణలు... ఆహార్యం తెలిపే నాన్న ఇస్త్రీ చేసిన లాల్చి... అంచు దోతుల వరసలు... అత్తరు పూసిన దూది...మైసూర్ శాండిల్ సబ్బులు, పౌదరు...తనబ్బిలో క్రింది వరసలో ఉంటాయని తెలిపారు. నాన్న జీవన సాఫల్యంకు సంబంధించిన అనుభవాలను... అనుభూతులను దృశ్యమానం చేసిన తీరు బాగుంది. 'నాన్న' శీర్షికతో రాసిన కవితలో మమతానురాగాలను సమంగా పంచే "సుమనస్కులు" కష్టాలలో వున్న వారిని ఆదుకునే "సహృదయుడు" అని కొనియాడారు. మంచితనాన్ని అంతరంగిక చక్షులతో చూడగలిగిన "సులోచనుడు" అని, నమ్మినవారిని ఆత్మీయంగా చూసే "సురక్షితుడు" అని.. మానవత్వపు గుణాలన్నీ కలబోసిన "సుగుణవంతుడు" అని... సహృదయమే సంపదగా కలిగిన వాడు "మా నాన్న" అంటూ నాన్న పట్ల కవయిత్రి తమ గౌరవాన్ని చాటుకున్నారు. ఇంకా ఈ మొదటి ఖండికలో అమ్మతనాన్ని... అమ్మ యొక్క గొప్పదనాన్ని.. నాన్న యొక్క ఔన్నత్యాన్ని, కూతుళ్ళు అలేఖ్య, అభిజ్ఞలతో ఉన్న బంధాన్ని... ఆత్మీయంగా అక్షరాల్లో ఆవిష్కృతం చేశారు.

రెండో ఖండిక.. అనుబంధాలులో.. విభిన్న కవితా వస్తువులతో కవయిత్రి తమ కవిత్వాన్ని ప్రకటించారు. 'అనుబంధాలు' విభాగంలో 50 కవితలు కొలువు దీరాయి....

'కీర్తి కిరీటి' కవిత ద్వారా తెలుగు కన్నడ మేళవించిన సంస్కృతిలో త్రిరాష్ట్ర కూటమిగా వెలిసిన మెతుకు సీమ యొక్క ఖ్యాతిని తెలియజెప్పారు. ఈ కవితలో ఏడు స్వరాలను వినిపించిన మంజీర నాదాలను.. నేటికీ నిలిచిన సర్వయాగపు శక్తి పూరిత ఆనవాళ్లను ప్రకృతిలో మమేకమైన ఆరాధనా మెలిమి క్షేత్రంగా వెలిసిన దుర్గమ్మను.. అభయారణ్యంలో మారుమ్రోగిన మంత్రఘోషను గండ శిలలపై నీటి ప్రవాహాన్ని... సప్త వర్ణాల సద్గుణ సింహ స్వరూపిణి మనోనేత్రాల ముందు వెలసిన వనదేవతను.. మానవాళికి మంచి నీరందించి.. సాగే మంజీర తల్లిని.. వనదేవతగా.. ఘనదేవతగా.. జనదేవతగా.. తెలంగాణకే కీర్తికిరీటిగా అభివర్ణిస్తూ.. కవయిత్రి అనూరాధ గారు తమ భావప్రకటన చేశారు.

బతుక నేర్పే బతుకమ్మను ప్రకృతికి ప్రతిరూపంగా... తెలంగాణ పండుగగా, ఆనందాలు ప్రతి ఇంటా నింపే పర్వంగా పేర్కొంటూ మరో కవితకు ఈ విభాగంలో చోటు కల్పించారు అంటూ బతుకమ్మ మాయమ్మ కవితను రాశారు. వసంతపు సొగసులు.. కుహూ కుహూ మంగళ ప్రద రాగాలతో ఏతెంచిన "శార్వరి" నామ సం. ఉగాదిని దృశ్యమానం చేస్తూ రాసిన కవితలో శుభాలను ఆకాంక్షించారు. ఉగాది పర్వదినం గురించి మరో రెండు మూడు కవితల్ని ఇందులో పొందుపరిచారు.

"రాములోరి కళ్యాణం" కవితలో శ్రీరామ నవమి విశేషాలను అక్షరాల్లో ఆవిష్కంచారు. కవయిత్రి అనూరాధ గారు వృత్తిరీత్యా గురుకుల విద్యాలయంలో అధ్యాపకురాలిగా పని చేస్తున్నారు... అంబేడ్కర్ బాటే.. మా గురుకులాలు అంటూ మరో కవితను రాశారు. అనాథలు, నిరాదరణకు గురైన జీవనాలు... వంటి ఆనాటి దుస్థితిని అధిగమించడానికి గురుకులాల స్థాపన జరిగిన సంగతిని ఈ కవిత ద్వారా వివరించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం వందేళ్ల ఘనకీర్తిని చాటి చెబుతూ.. 'విద్యకు ఆలయం' కవితను తీర్చిదిద్దారు. ఉద్యమాల వూపిరి వేదికవు.. బ్రతుకు పోరు బాటలో ప్రగతివి, జీవన్మార్గా ఊతవు.. నీ చరిత అమోఘం... అద్భుతం - అంటూ ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని కొనియాడారు. 'మాను ఇచ్చు మంచి ఫలము' కవితలో మానులే మానవ మనుగడకు ఆధారమని తేల్చి చెప్పారు. అలసిన దేహానికి... సొలసిన మనసుకు.... ఆలోచన మేథకి... విశ్రాంతినిచ్చే "యామిని"ని ఆవిష్కరిస్తూ ఇంకొక కవితకు ఇందులో చోటు కల్పించారు. ఉదయం రావాలంటే.. శ్యామికకి ఆహ్వానం పలకాల్సిందేనంటూ కొనసాగించారు.

నమ్మకపు పునాదిపై నిలిచిన మందిరమే స్నేహమంటూ .. 'స్నేహమందిరం' కవితను రాశారు. పండుగలు మన సంస్కృతి సాంప్రదాయపు వారధులు అంటూ... "పండుగలు... పరమార్థం" కవితను రూపుదిద్దారు. కవయిత్రి అనూరాధ గారు "జీవితం" కవితలో... జీవితమంటే సప్తవర్ణాల శోభితమని.. గెలుపు ఓటముల చదరంగపు ఆట అని.. సుఖ సంతోషాల అమృత భాండమని వివరించారు. 'నాతిచరామి' అనే మాట... ఏక బాటగా వేసే అడుగులే సప్తపది అంటూ "సప్తపది" కవితను తీర్చిదిద్దారు.

వివాహ బంధం యొక్క గొప్పదనాన్ని అక్షరాల్లో నిక్షిప్తం చేశారు. "పెళ్లి పుస్తకం" కవితలోనూ పెళ్లి యొక్క ఔన్నత్యాన్ని చాటిచెప్పారు. "బాల్యమా!" కవితలో చిన్ననాటి స్మృతులను ఏకరువు పెట్టారు. బాల్యం... తిరిగి రాని మూల్యమని కవితను ఎత్తుకున్న తీరు బాగుంది. మాయా మర్మం తెలియని... అమాయకత్వపు, మరువలేని బాల్యపు తీపి గురుతులను ఈ కవిత ద్వారా కవయిత్రి అనూరాధ గారు మనతో పంచుకున్నారు. 'బాల్యం తిరిగి రాని మూల్యం" అంటూ మరో కవితనూ రాశారు.

గురువు యొక్క ఔన్నత్యాన్ని తెలియజేస్తూ "గురుబ్రహ్మ" కవితను రాశారు. 'ప్రత్యక్ష దైవమా.... అనుభవపు సాన మీద అరగదీసిన చందనమా" అంటూ ప్రారంభించిన తీరు బాగుంది.

"మనసు" కవితలో మనసు యొక్క గడుసరి తనాన్ని ఆవిష్కరించారు. "తెలుగు మాధుర్యం", "అమ్మ భాష" కవితల ద్వారా తెలుగు భాష యొక్క ఔన్నత్యాన్ని తెలియ జేశారు.

"నవ్వు" కవితలో మానవునికి పెట్టని ఆభరణం నవ్వు అని వివరించారు. నవ్వు నవ్వించు... అదే నిన్ను గెలిపిస్తుందని విడమరిచి చెప్పారు.

అపురూప అద్దాల మేడలో...సౌందర్య వనాలు ఇక్కడి వీధులు.. అందాలు ఆరబోసిన తీరులు... ఆకాశాన్ని ముదుతున్న సౌధాలు అంటూ "అమెరికా అందం" కవితను రూపుదిద్దారు.

కవితకేదీ కాదనర్హం అని శ్రీశ్రీ గారన్నట్లు కవయిత్రి అనూరాధ గారు "కొంగు" పై కవితను రాసి కొంగు హంగులను విశ్లేషించారు. తెలుగు సాంప్రదాయానికి చిహ్నం కొంగు అని... ప్రేమ ఆప్యాయత రూపమనీ.. భారతీయ సంస్కృతికి కొంగు చిహ్నమనీ.. ఆ కొంగు ధరిస్తే నీ గౌరవం పొంగు అంటూ ఈ కవితకు మంచి ముగింపు నిచ్చారు. ఇంకా ఈ రెండో ఖండికలో నీరు మీరు, మిషన్ భగీరథ, మానవీయత, డబ్బు కవిత్వం కరదీపిక తదితర కవితలకు చోటు కల్పించారు.

ఇలా "అనుబంధాలు" - శీర్షికతో కొలువుదీరిన 50 కవితలూ కవయిత్రి యొక్క అనుభవాలను, అనుభూతులను మోసుకొచ్చాయి. సాదాసీదాగా రూపుదిద్దుకున్న ఈ కవితల్లో కవిత్వం కోసం వెతకకుండా... కవయిత్రి యొక్క అంతరంగంలో కదలాడే భావ పరంపరను చదివి అభినందిద్దాం.

ఇక "సంబంధాలు" శీర్షికతో మూడో ఖండికలోని కవితల్లో సాహితీ దిగ్గజాలను.. ప్రముఖులను.. సగౌరవంగా ఆవిష్కరించారు.

నేటి మహిళ, ప్రగతి పథాన మన భారత, వర్ధిల్లు తెలంగాణ, కళలకు కాణాచి, రాధ పయనం, తెలుగు వెలుగు, రక్త సంబంధం, ఓ మానవా! యువత, నేటి సాహిత్యం అక్షరం తదితర శీర్షికలతో కవితల్ని తీర్చిదిద్దారు. విభిన్నమైన కవితా వస్తువులను ఎంపిక చేసుకున్న కవయిత్రి అనూరాధ గారు తమదైన శైలిలో సరళత్వానికి పెద్ద పీట వేస్తూ తమ సృజనను చాటుకున్నారు.

కవయిత్రి అనూరాధ గారు కవిత్వ రచనలో మరిన్ని మెలకువలు తెలుసుకుని.. అధ్యయనం పై దృష్టి సారించి.. తమ కలానికి పదును పెట్టుకోవాలని కోరుకుందాం.



- దాస్యం సేనాధిపతి
9440525544

ప్రతులకు:
-డా॥భాష్యం అనూరాధ
8790325502







# మాదక ద్రవ్య వ్యసనం నుండి పుస్తక పఠనంలోకి మార్చాలి

**-యువతకు మంత్రి జూపల్లి కృష్ణారావు హితవు**

కవులు, రచయితలు, సాహితీ వేత్తలు, యువతను మాదకద్రవ్య వ్యసనం నుండి పుస్తక పఠనం వ్యసనంలోకి తీసుకువస్తేనే సమాజం లో సరైన మార్పు, చైతన్యం కలుగు తుందని రాష్ట్ర ఎక్సైజ్, సాంస్కృతిక పర్యాటక శాఖామాత్యులు జూపల్లి కృష్ణారావు అన్నారు.

ప్రముఖ రచయిత పెద్దూరి వెంకటదాసు రచించిన "ప్రేమ చిగురించిన శుభవేళ" కథా సంపుటి పుస్తకావిష్కరణ సభ జివిఆర్ ఆరాధన కల్చరల్ ఫౌండేషన్, తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో నిర్వహించారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలోని ఇల్లు గ్రంథాలయంగా మారాలన్నారు. జీవన విధానంలో పుస్తకాలు ఓ భాగమన్నారు. టెక్నాలజీ యుగంలో కూడా పోలీస్ శాఖలు సేవలు అందిస్తూ పుస్తకాలు రాయడం గొప్ప విషయమన్నారు.



పెద్దూరి వెంకటదాసు రచించిన "ప్రేమ చిగురించిన శుభవేళ" పుస్తకావిష్కరణలో డా॥ పోరెడ్డి రంగయ్య, వంశీరామరాజు, బైస దేవదాసు, డా॥ ఏనుగు నరసింహారెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావు, రచయిత పెద్దూరి వెంకటదాసు, డా॥నామోజు బాలాచారి, వి.వి.రాఘవరెడ్డి, పొత్తూరి సుబ్బారావు, పొత్తూరి జయలక్ష్మి , రోటం భూపతి ముదిరాజ్

భవిష్యత్తులో సమాజాన్ని మార్చే మరిన్ని గొప్ప రచనలు చేయాలని వెంకటదాసుకు సూచించారు. అలాంటి రచనలను మీకు ఒక్క రూపా యి ఖర్చు కాకుండా అచ్చువేయించే బాధ్యత తనదని వాగ్దానం చేశారు. అనంతరం పెద్దూరి వెంకటదాసు దం పతులను మంత్రి ఘనంగా సత్కరించారు.

సాహిత్య అకాడమీ కార్యదర్శి డా॥నామోజు బాలాచారి సభాధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథిగా పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డా॥ ఏనుగు నరసింహారెడ్డి మాట్లాడుతు పెద్దూరి వెంకటదాసు రాసిన ఈ కథలు మనను ఆలోచింపచేస్తాయని చివరి వరకు కథ చదువుతేనేగాని మనకు కథాబలం ఎంత వుందో తెలియదన్నారు. ప్రతి కథలో ఒక ట్విస్ట్ వుంటుందని, తను పని చేసిన పోలీసు శాఖపైనే పలు కథలు వుండడం విశేషమన్నారు. పోలీసు శాఖలో విధి నిర్వహణ గురించి గొప్పగా చెప్పారని మిగతా కథలు కూడా మననను ఆనందింపజేస్తాయని పెద్దూరిని అభినందించారు.



సభలో ప్రసంగిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు,డా॥ ఏనుగు నరసింహారెడ్డి, డా॥నామోజు బాలాచారి, బైస దేవదాసు,కె. మదన్‌మోహన్, పొత్తూరి సుబ్బారావు, వంశీరామరాజు, పొత్తూరి జయలక్ష్మి, డా॥ పోరెడ్డి రంగయ్య, వి.వి.రాఘవరెడ్డి

తన వృత్తి మీద వున్న గౌరవంతో రాసిన కవితను పోలీసు ఉన్నతాధికారులు చదివి వినిపించుకున్న పెద్దూరి వెంకటదాసును అభినందించారని గౌరవ అతిథి నేటినిజం పత్రిక సంపాదకులు బైస దేవదాసు తెలిపారు. మంచి వ్యాఖ్యాతగా రాణిస్తారని జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డా॥సినారె పెద్దూరిని ఆశీర్వదించారని ఈ రోజు రాష్ట్రమంత్రి జూపల్లి కృష్ణారావు పుస్తకాన్ని ఆవిష్కరించడం పెద్దూరి పట్ల ఇందరి "ప్రేమ చిగురించిన శుభవేళ" అని పెద్దూరిని కొనియాడారు.



పెద్దూరి వెంకటదాసు దంపతులను సత్కరిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు,అతిథులు.

ఆత్మీయ అతిథి పొత్తూరి సుబ్బారావు మాట్లాడుతూ తమ కుటుంబంలోని వ్యక్తిగా ఎంతో సన్నిహితంగా వుండే పెద్దూరి వెంకటదాసు కవిత్వమైన, కథలైన గొప్పగా రాస్తున్నారని తమ సాహితీ కిరణం మాసపత్రికకు ఎంతో సహకారం అందిస్తున్నారని తెలిపారు.

మరో ఆత్మీయ అతిథి కటికనేని మదన్‌మోహన్ మాట్లాడుతు తమది ఒకటే ఊరని పెద్దూరి వ్యక్తిత్వాన్ని, సాహిత్యాన్ని, సాన్నిహిత్యాన్ని వివరించారు.

ప్రముఖ రచయిత్రి శ్రీమతి పొత్తూరి జయలక్ష్మి "ప్రేమ చిగురించిన శుభవేళ" పుస్తక సమీక్ష చేశారు. రచయిత దృక్పథాన్ని, కథాబలాన్ని వివరించారు.

తొలిప్రతిని డా॥ శ్రీనివాస్ కాశా దంపతులకు అందజేశారు. తొలి ప్రతిని అందుకోవడం తన అదృష్టంగా భావిస్తున్నానని డా॥ శ్రీనివాస్ అన్నారు.

ఒకే వేదికపై తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డా॥ ఏనుగు నరసింహారెడ్డి, సాహిత్య అకాడమీ కార్యదర్శి డా॥నామోజు బాలా చారి వుండడం పెద్దూరి వెంకటదాసు అదృష్టంగా భావిస్తున్నానని వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు అన్నారు. కవి, రచయిత, వాఖ్యాత, తేజ ఆర్ట్స్ అధ్యక్షులు డా॥పోరెడ్డి రంగయ్య సభ సమన్వయం చేశారు.జివిఆర్ వ్యవస్థాపక కార్యదర్శి లయన్ వి.వి. రాఘవరెడ్డి సంస్థ కార్యకలాపాలను వివరించారు. అతిథులను సత్కరించా రు.మొదట కడియాల ప్రభాకర రావుప్రార్థన గీతం చేశారు. సభకు ముందు నవరస గాయని ఆమని సంగీత విభావరి అందరిని అలరించింది.



డా॥ శ్రీనివాస్ కాశా దంపతులకు తొలి ప్రతిని అందజేస్తున్న పెద్దురి వెంకటదాసు, అతిథులు.

# విద్య

ఒక విద్య
పాఠం బోధిస్తుంది
సంస్కారం నేర్పుతుంది
ప్రతి విద్య మనిషి మనుగడ కాకపోవచ్చు
కాని ఒక విద్య మనిషి జీవిత వృత్తి కావాలి
ఒక విద్య మనిషి జీవన శైలిగా మారాలి.
ఒక విద్య
గెలుపు కారణమవ్వాలి
ఎదుగుదల శిఖరమవ్వాలి
అలంకార ఆభరణమవ్వాలి.

ఒక మనిషి
జీవితానికి ఉపయోగపడని విద్య
జీవనానికి సహాయపడని విద్య
మనం చూస్తుండగానే మరుగున పడుతుంది
మనం చూస్తుండగానే అదృశ్యమవుతుంది



-కోటం త్రిశూల్
8523005678



మంగళవారం రవీంద్రభారతిలో అక్షర పబ్లికేషన్స్ ఆధ్వర్యంలో 'బ్నిం' పుట్టిన రోజు సందర్భంగా "సెల్ఫీ రామాయణం" ఆంగ్లానువాదం, "అనగనగా.." మరియు సరస్వతి కరవది రచన "అమ్మ మనసు" పుస్తకావిష్కరణలో 'శ్రీరామ జోగయ్య శాస్త్రి, వి.ఎన్. ఆదిత్య, డా॥శిష్టా చంద్రశేఖర్, పింగళి వెంకటేశ్వరరావు, సరస్వతి కరవది, వెంకట్ తదితరులు.



-డా॥రావి రంగారావు
9247581825

ఈ వారం అంశం: వాళ్లు పరుగులు తీస్తున్నారు
పేస్ బుక్ "అమరావతి సాహితీ మిత్రులు" గ్రూపులో డా. రావి రంగారావు 2024 నుండి నిరంతరాయంగా నిర్వహిస్తున్న వారం వారం కవితల వర్క్ షాపులు.
"వారం వారం కవితల వర్క్ షాప్" 36కు మొత్తం 21 మంది కవులు తమ కవితలు పోస్ట్ చేశారు. 6 కవితలకు ప్రశంసా పత్రాలు లభించాయి.

## వచన కవితలు

### మనిషి ప్రయాణం

మనిషిప్పుడు తప్పిపోయాడు
ఆకారం మనిషిదే,
వికారపు చేష్టలతో
తన్ను తాను తప్పిపోయాడు,
పతోడు ఎదుటోణ్ణి మోసగించ జూస్తాడు,
ప్రపంచం ఓ కుగ్రామం అయిన వేళ
మనిషి మనిషితనాన్ని మరచిపోతున్నాడు!.
కులం కుంపటి
నెత్తినెట్టుకోని ఊరేగుతున్నాడు
మతం మసిగుడ్డను ముడ్డికి చుట్టుకొన్నాడు,
వావి వరుసలు
మరచిన మృగాడవుతున్నాడు,
కన్నవారిని కానివారిగా చూస్తూ
కన్న పేగుకు బాధల నెగడును అంటించి
వృద్ధాశ్రమాల్లోకి నెట్టేస్తున్నాడు,
మానవత్వం మాయమయింది,
దానవత్వం సొంతమైన వేళ
తనవారెవరో,
పరాయి వారెవరో తెలియని
అజ్ఞానపు దిగుడు బావిలోకి
మనిషి కూరుకు పోయాడు,
అయినా ఆతని ప్రయాణం ఆగలేదు,
భువినుండి అంతరిక్షంలోకి పరిగెడుతున్నాడు!.
మనిషి ఇప్పుడు
స్వేదం చిందించేందుకు
సిగ్గు పడుతున్నాడు,
శ్రమను మరచిపోయి ఉచితాలకు
ఉబలాటపడుతున్న ఊసరివెల్లి కదా!.
ప్రతి మనిషి కోరికల బానిస కొడుకే,
త్యాగాన్ని త్యజించి స్వార్థపు కౌగిట్లో
బందీ అయిపోయి బంధువులను
రాబందులుగా చిత్రిస్తూ పయనిస్తున్నాడు...
ఈ పోటీ ప్రపంచంలో
మనిషిని మనిషిగా ప్రేమించడం మరచి
వస్తు ప్రేమను కోరుకుంటూ
మనిషిప్పుడు మనీ చుట్టూ
గింగిర్లు తిరుగుతూ తన్ను తాను
మోహపు చూపులకు
బలి పశువును చేసుకొని
గమ్యం లేని ప్రయాణం చేస్తున్నాడు!.
చూడు చూడు కాలమా!
ఈ మనిషి కాని మనిషిని చూడు,
బాగా చూడు, దగ్గరగా చూడు,
నువ్వే కదా ఈ జగతి కంతా దిక్సూచివి,
నువ్వే కదూ... ఎవడు మనిషో
ఎవడు మనిషి కాదో నిర్ణయించేది,
చూడు కాలమా చూడు చూడు!

### కట్టెముట్టే వరకు...

పిడికెడు మెతుకులా
వెదుకు లాట..
పరువు మర్యాదలా
పాకులాట.........
ఎగబాకినవి రెండు
దిగజారినవి మూడు...
జారుడు మెట్లాటే
మనిషి ప్రయాణంబు..
అందినవి పుల్లన
అందనవి తీయన..
అడుగు దూరములోన
అనుకున్న స్వర్గంబు...
గతుకులా రోడ్డులో
బతుకు బండి...
ఒడిదుడుకులా
తోటి సాగుతుంది..
నడిచినా దారులు
నలిగినా నడుములు...
మోసినా బరువులు
కాసిన పరువులు..
చేదు గుళికలు కొన్ని
తీపి గురుతులు కొన్ని
అభిమానములు కొన్ని
అవమానములు కొన్ని.
కొంచె మానందము
కొండంత దుఃఖము
కోరికల సంద్రము
కొనలేని చందము.
ఎడతెగని లెక్కలు
ముడివిడని చిక్కులు
కనబడును చుక్కలు
కనరావు దిక్కులు.
అనుభవాల మూట
బరువెక్కుతుంటుంది
ఆచి తూచి నిన్ను
అడుగెయ్యమంటుంది.
అత్తెసరు మార్కులతో
గట్టెక్కు వైనంబు
ప్రతి దినము ప్రశ్నలే
పయనంబులోన.
కష్ట సుఖముల
కడలి జీవితంబు.
కట్టె మట్టే వరకు
సాగుతూ ఉంటుంది.
కట్టె ముట్టంగానే
కడతేరుతుంది
జీవన పయనంబు
మనిషి ప్రయాణంబు.
**-మేడిశెట్టి యోగేశ్వరరావు**

చెమట చుక్కల్ని చమురు చేస్తూ
మేధో మదనపు వత్తులేస్తూ
సాధనతో చరిస్తూ, జ్వలిస్తూ
భావి భారతానికి వెలుగు ప్రదాతలుగా
కొవ్వొత్తిలా కరుగుతూ, వొరుగుతో
ధ్రువతారలై వెలగాలని
కొందరి ప్రయాణం .
కోరికల అలలపై తేలిపోతూ
ఆశల సునామీలో కొట్టుకు పోతూ
గమ్యం ఎరుకలేని నావలా
అందని ద్రాక్షకై అర్రులు చాస్తూ
అత్యాశకు అలసత్వానికి వారసులై
కొందరి ప్రయాణం...
ఆటంకాల అడ్డుగోడలు కూల్చేస్తూ
ఇనుప సంకెళ్ల చరితలు తుడిచేస్తూ
ఉడుం పట్టులా లక్ష్యం వీడక
ఉక్కు సంకల్పంతో విక్రమార్కులై
అజేయమైన విజయబాటలో
కొందరి ప్రయాణం...
ఆకలి తీర్చలేని పొంగులతో
అణుకువ మరిచిన ఆడతనం తో
కుబుసం విడిచిన పాములా
కామ దాహం తో రేగుతున్న ఆడపులిలా
మంగళ తోరణాలతో మరణ మృదంగాన్ని
మ్రోగిస్తూ కొందరి ప్రయాణం.
అనుభవాల్ని అదిగురువుగా భావిస్తూ
అలుపెరుగని కెరటాలై పడిలేస్తూ
అస్తమించుట మరచిన సూరీడులా
జగన్నాధ రథ చక్రాలై
నిత్య చైతన్య క్రాంతులుగా కొందరి ప్రయాణం.
జీవన వైకుంఠపాలే వైకుంఠ పాళీలో
ఎగబాకుతూ, దిగజారుతూ
కర్మల నావ కల్లోల కడలి దాటి
విముక్తి తీరంచేరే దాక
జనన మరణ చక్రభ్రమణాల తో
నిత్య భూ భ్రమణమే మనిషి ప్రయాణం
**-మేడిశెట్టి సుభద్రా కృష్ణ**

### మహాకావ్యం

జననం ఒక తుంపరలా
జారిన ఉదయం
కేరింతల నడుమ
మొదటి అడుగులోనే
విశ్వ మార్గం కోసం
మనిషి ప్రయాణం..
పసితనపు నవ్వుల్లో
సూర్య కిరణాలు కలిసిపోతే,
కలలతో నిండిన బాల్యం పుస్తకమై
జ్ఞాన మార్గం కోసం
మనిషి ప్రయాణం...
యౌవనంలో వేడుకల పటాసుల్లా
అరుణోదయపు తుఫాన్లలా
మనిషి పరుగులు తెలియని ఆకాశం తాకాలని,
అందని ద్రాక్ష పొందాలని
మనిషి ప్రయాణం...
ప్రేమలో పువ్వులా వికసించి,
వేదనలో గాయమై రాలిపడి,
ప్రయత్నాల పొలంలో
చెమట విత్తనాలు చల్లి,
విజయపు పంట
కోయాలనే ఆశ వెనుక
మనిషి ప్రయాణం..
కాలచక్రం వేగంగా తిరుగుతుంటే,
అల్లకల్లోలంలోనే అనుభవం,
సుడులు తిరుగుతూ తీరమే తెలియని
యాత్ర చివరంచు కొస తాకాలని
మనిషి ప్రయాణం ...
ముదుసలి కళ్లలో స్మృతుల వెలుగు
మనసులోని నక్షత్రాల్లా మెరిసిపోతూ
వెనుక చూపులో నడకలు మిగిలి,
ముందు చూపులో నిలిచిన మౌనం
దిక్కు తోచని దారి వెతుకుతూ
మనిషి ప్రయాణం...
జననం నుంచి జ్ఞాపకాల దాకా
సమయం రాసిన మహా కావ్యం జీవితం
ఆత్మ నుండి ఆకాశం వరకు
నిత్యం తపిస్తూ మనిషి ప్రయాణం
తృష్ణ తీరక, కృష్ణ కృష్ణ అనుకుంటూ...
**-శరకణం కనకదుర్గ .**

## మినీ కవితలు

### ఆఖరి ప్రయాణం

ఇక తిరుగు ప్రయాణం
ఉండదన్నాక గాని
తెలియలేదు ..!
అన్నేళ్ల తన
ప్రయాసల ప్రయాణం
ఏ పాటిదో అని!!

### ఎడారి బ్రతుకు

అలుపనేది లేకుండా
ఆశల ఎడారిలో
ప్రయాణిస్తున్నాడు
మనిషి ..!
గమ్యస్థానం ఎండమావి
అని తెలియక!!

### ఒంటరి ప్రయాణం

ఒక్కో అడుగేసి
అనుకున్న దూరానికి
దగ్గరయ్యాడు!
ఒక్కొక్కరుగా
తనకున్న దగ్గరోళ్ళు
దూరమయ్యారు!!

### అడుగు తడబాటు

కలిసి నడుద్దామని
ఏడడుగులతో ప్రయాణాన్ని
ప్రారంభించారు!
గమ్యం చేరకుండానే
మనస్పర్థలతో
రోడ్డెక్కారు!!

### జీవన ప్రమాణాలు

మనిషి ప్రయాణమేమో
ఆకాశానికి ..!
జీవన ప్రమాణాలు మాత్రం
పాతాళంలోనే!!
**-టి. ధనుంజయ రెడ్డి,**

### ప్రయాణం

చీమల ప్రయాణం
స్వయం పోషణకు,
మనుష్యులది
పరపీడన
పరాయణత్వం.
క్యూ -లు !
సూర్యుడు
ఉదయించక
ముందే ,
గుళ్ళముందు.
అస్తమించక
ముందే ,
బార్ల ముందు .

### పరుగులు !

పొట్ట
తగ్గించుకోవడానికి
ఉన్నోడి పరుగులు .
పొట్ట
పోషణకు
లేనోడి పరుగులు .

### రెప్పపాటు

నిర్లక్ష్యం వద్దు
ప్రయాణంలో జరిగే
ప్రమాదాలన్నీ
రెప్పపాటులోనే!

### పరుగులు

ఎక్కడికో ,
ఎందుకు పరుగులు?
దిగంబరంగా ఉండు!
కమండలం పట్టు..!
హుండీ పెట్టు !
పెట్టుబడి లేని ,
ఆదాయం.
**-నంద్యాల లక్ష్మా రెడ్డి**

# ఈనాటి పరిస్థితుల మూలాలను ఆనాడే పసిగట్టిన బి.యస్.రాములు

-సంగిశెట్టి శ్రీనివాస్

హైదరాబాద్, అక్టోబర్ 29: (నేటినిజం ప్రతినిధి): ఈనాటి పరిస్థితులకు మూలాలను ఆనాడే ఎలా పసి కట్టిన తీరు **"అఖిల భారత పర్యటణ"** గ్రంథంలో కనపడుతుందని సంగిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సుప్రసిద్ధ సాహితీ వేత్త సంగిశెట్టి శ్రీనివాస్ అఖిల భారత పర్యటన పుస్తకాన్ని పరిచయం చేశారు. ఇది ఒక చారిత్రక డాక్యుమెంటు అన్నారు. 1985 నాటికి దేశంలో వామ పక్ష తీవ్రవాద ఉద్యమాలు దేశ వ్యాప్తంగా ఎలా సాగుతు న్నాయో ప్రత్యక్షంగా చూసినవి నాయకుల తో చర్చించిన అంశాలు రికార్డు చేశారు. ఆనాటికే ఉద్యమాల్లో కుల సమస్య , కుల వివక్ష తీవ్ర స్థాయికి చేరుకొని ఉద్యమాలు ఎదుగుదల లేకుండా నిలిచి పోయాయని చెప్పడంతో పాటు అంబేద్కర్ దృక్పథాన్ని అధ్యయనం చేసి ఉద్యమ రూపాలను రూపొందించుకో వాలని అవగాహన కొచ్చారు. అయితే పార్టీలు అంబేద్కర్‌ను వ్యతిరేకించాయి అన్నారు.

విశాల సాహిత్య అకాడమి వారు భారతీయ సాహిత్య అనువాద ఫౌండేషన్ సౌజన్యంతో ఆది వారం హైదరాబాద్ బాగ్‌లింగం పల్లిలో గల సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో షోయబ్ హాల్ లో తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ తొలి చైర్మన్, సామాజిక తత్వవేత్త బి ఎస్ రాములు గారి "అఖిల భారత పర్యటన " అనే స్వీయ చరిత్ర నాలుగవ సంపుటి మరియు వర్ధమాన కవయిత్రి మామిడిపెల్లి ఇంద్రాణి గారి తొలి కవితా సంపుటి "ఇంద్ర-కమలం " రెండు పుస్తకాల ఆవిష్కరణ జరిగింది.

"అఖిల భారత పర్యటన" గ్రంథాన్ని నేటి నిజం సంపాద కులు బైస దేవదాస్ ఆవిష్కరించారు. తొలి ప్రతిని కర్నాటి మనోహర్ గారికి అఖిల భారత వీవర్స్ ఫ్రంటు నాయకులకు అందజేసారు.



బి.యస్.రాములు రచన "అఖిల భారత పర్యటన" పుస్తకావిష్కరణలో మామిడిపెల్లి ఇంద్రాణి, జాజుల గౌరి, జ్వలిత, బి.యస్.రాములు, ఆవిష్కర్త బైస దేవదాసు, బిక్కి కృష్ణ, సంగిశెట్టి శ్రీనివాస్, డా॥జెల్ది విద్యాధరరావు, డా॥ రాధాకుసుమ.

రాములుగారు ఈ పుస్తకంలో జీవిత సత్యాలను, మారుతున్న పరిస్థితులను వివరించారని, రాములుగారి రచనలన్ని సామాజిక స్పృహతో కలిగినవని బైస దేవదాసు అన్నారు. వందకు పైగా పుస్తకాలను వెలువరించి సమాజంలో మార్పు కోసం ఇతోధికంగా కృషి చేస్తున్నారని అన్నారు. యువ రచయితలను ప్రోత్సహించడంలో ముందు వరసలో నిలిచారని, ఈ రోజు ఇంద్రాణి కవయిత్రిగా, వెలుగు చూడడంలో రాములు పాత్ర గొప్పదని అన్నారు. పిన్న వయసులోనే చదువుపై ఎంతో శ్రద్ధ పెడుతూనే సాహిత్య ప్రపంచంలోకి అడుగిడిన యువ కవయిత్రి ఇంద్రాణి అని, అవగాహనతో కవిత్వం రాసిందని, ఎవరికి వారే ధైర్యాన్ని పుణికి పుచ్చుకుని తనను తాను కాపాడుకుంటూ మనిషి తన కర్తవ్యాన్ని నెరవేర్చాలని అక్షర బాణాలు సంధించిన ఇంద్రాణిని అభినందించారు.

మామిడిపల్లి ఇంద్రాణి "ఇంద్ర-కమలం " కవితా సంపుటిని బి.ఎస్.రాములు ఆవిష్కరించారు.

మామిడిపెల్లి ఇంద్రాణి తన తొలి ప్రతిని అమ్మకు, అన్నకు అందజేసి సత్కరించారు.

సామాజిక న్యాయం కోసం సాహిత్యాన్ని సృష్టించాలని పూర్వ బి.సి.కమిషన్ చైర్మన్ బి.ఎస్. రాములు పిలుపు నిచ్చారు. తాను దేశమంతా పర్యటించి ప్రత్యామ్నాయ సాహిత్య సృష్టితో ప్రజా ఉద్యమాలను స్వయంగా పరిశీలించానని తెలిపారు. దళిత బహుజనులు చైతన్యవంతులై రాజ్యాధికారం చేపట్టిన నాడే సామాజిక న్యాయం సాధ్యపడు తుందని అభిప్రాయపడ్డారు. యువ రచయితలు , కవులు, కవయిత్రులు ప్రశ్నించడంతో పాటు వాటికి తామే పరిష్కారాలు వెతికి నాయకత్వం వహించాలని అన్నారు. ప్రశ్నించడంతో ఆగిపోతే ప్రతిపక్షంగా మిగిలిపోయి పాలితులుగా మారుతారు. ప్రశ్నకు మనమే జవాబివ్వడం ద్వారా నాయకత్వం అందించడం ద్వారా రాజ్యాధికారంలోకి వస్తారని అన్నారు. తన అఖిల భారత పర్యటనలో అన్నిటికన్నా బాగా నచ్చిన ఉద్యమం శంకర్ గుహ నియోగి నాయకత్వంలో చత్తీస్‌గడ్, భిలాయ్, రాజ్‌నంద్ గాం లో సాగిన సమగ్ర సామాజిక వికాసం అని, ప్రభుత్వంతో పని లేకుండా స్కూల్లు, హాస్పటల్స్ మొదలైనవన్నీ వారే స్వయంగా నిర్వహిస్తున్నారని అన్నారు. యువ కవయిత్రి ఇంద్రాణి "ఇంద్ర కమలం" కవితా సంపుటిలో అనేక అంశాలపై, అధునాతన ప్రతీకలతో సహజ భావోద్వేగాలతో అద్భుత కవిత్వం పండించారన్నారు.



మామిడిపెల్లి ఇంద్రాణి కవితా సంపుటి "ఇంద్ర-కమలం" ఆవిష్కరణలో జాజులగౌరి, జ్వలిత, ఆవిష్కర్త బి.యస్.రాములు, మామిడిపెల్లి ఇంద్రాణి, బైస దేవదాసు, సంగిశెట్టి శ్రీనివాస్, డా॥జెల్ది విద్యాధరరావు, డా॥ రాధాకుసుమ.

వి.జి.ఆర్.నారగోని మాట్లాడుతూ 1990 నుండి రాష్ట్ర వ్యాప్తంగా సామాజిక సాహిత్య ఉద్యమాలను బి.ఎస్.రాములు ముందుకు నడిపారని అందరం కలిసి పనిచేసి సామాజిక సాహిత్య చరిత్రను మలుపు తిప్పడం జరిగిందని , బి.ఎస్.రాములు దరకమే అధ్యక్షులుగా చేసిన కృషి చరిత్రాత్మకమైనదని పేర్కొన్నారు.

కళారత్న బిక్కి కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సభలో సాహితీవేత్తలు డా॥ జెల్ది విద్యాధర్, డా॥అనంత పద్మనాభరావు , మువ్వా శ్రీనివాస రావు ,కవయిత్రులు జ్వలిత, జాజుల గౌరి, డా॥రాధా కుసుమ, తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఇంద్రాణి కవితల సంపుటికి శ్రీమతి సుశీలా నారాయణ రెడ్డి ట్రస్టు తరఫున సి. గంగ గారు పూర్తి స్థాయిలో సౌజన్యం అందించారు.

బి.ఎస్.రాములు, మరెందరో సహకారం వల్లనే తాను కవయిత్రిగా వెలుగులోకొచ్చానని, తన కుటుంబ సభ్యులు సహకారం మెండుగా వుండడం అదృష్టంగా భావిస్తున్నానని కవయిత్రి ఇంద్రాణి అన్నారు.

డా॥ రాధాకుసుమ నిర్వహణలో జరిగిన కవి సమ్మేళనంలో ఝాన్సీ ముదుంబై, కె.వి.ప్రభాకరరావు, మామిడి అక్షిత, కందుకూరి కోటేశ్వరరావు, హరిప్రసాద్, శ్రీమధు, శాంతిశ్రీ, షామీర్ జానకీదేవి, కొమ్ము వరలక్ష్మి, యం. ప్రసాద్‌లు పాల్గొన్నారు.

# గంగా జమున అంతరంగ సృజన "గంగా తరంగాలు"

పుస్తక సమీక్ష

విఘ్నాలను తొలగించి విజయం చేకూర్చే శృతియజ్ఞ విభూషతుడిని సాహిత్య వనసౌరభంలోని అక్షర సుమాలతో అల్లిన అక్షరమాలను గణపతికి అందించిన ఘంటాపథము కవితతో ప్రారంభించిన గంగా తరంగాలు కవితా సంపుటి రచయిత్రి గంగా జమున దడివెకు స్వాగతం పలుకుదాం.

**"నిజం నిగ్గు తేల్చేది**
**అన్ని రంగాల్లో అవినీతిని**
**ప్రశ్నించేది అక్షరమే**
**అక్షరం అవినీతి మీద**
**అలుపెరుగని పోరాటం చేస్తూ**
**సమాజ చైతన్య వారధి అవుతుంది**
**అక్షరం చేసే కదనంలో**
**బందూకులు లేవు**
**బలమైన కలాలు తప్ప"**

సమాజంపై అక్షరం ఎలా పని చేస్తుందో ,ఎంత ప్రభావాన్ని చూపుతుందోనన్న అంశాన్ని అల్ప పదాలతో అనంతమైన అర్థాన్ని స్ఫురించేలా కవితను అందించిన గంగా జమున దడివె ఒక ప్రైవేటు విద్యా సంస్థలో పనిచేస్తున్న ఉపాధ్యాయిని. అటు విద్యాబోధన చేస్తూనే మరోవైపు సామాజిక చింతనతో కవితలు రాయడం ప్రారంభించింది.. ఆమె కవితల్లో సమాజం తీరుతెన్నులు, వ్యక్తుల్లో కన్పించే విభిన్నమైన కోణాలు ఆవిష్కరించబడినాయి. యువతను ప్రోత్సహిస్తూ వారి బాధ్యతలను గుర్తుచేస్తున్న కవితలున్నాయి. తన జీవితంతో ముడిపడిన బంధాల జ్ఞాపకాల చెలిమలున్నాయి. జరిగిన సంఘటనల తాలూకు అనుభవాల జాడలు కన్పిస్తాయి. పర్యావరణ జాగృతి విన్పిస్తుంది. తన చుట్టూ ఉన్న పరిసరాల పరిమళాల గుబాళింపు ఉంది.

**"వాడి పాడేద్దామనే సంస్కృతి అరువు తెచ్చుకున్నాం**
**బతుకులు రోగాలకు అద్దెకిచ్చేస్తున్నాం"**

మానవుడు సౌకర్యవంతమైన జీవితానికి అలవాటు పడి తాను సృజించిన వస్తువులే తనకు మరణాన్ని పరిచయం చేస్తున్న పరిస్థితులు మన కళ్ళ ముందు ఎన్నో... మన జీవితంలో ప్లాస్టిక్ విడదీయరాని బంధాన్ని ఏర్పరుచుకుంది, యూజ్ అండ్ త్రో వినడానికి సింపుల్‌గా ఉన్నా ప్లాస్టిక్ యూసేజ్ వల్ల మన జీవితాలు ఈ లోకం నుంచి గెంటి(త్రో) వేయబడుతున్నాయి. పర్యావరణాన్ని మనుషుల జీవితాన్ని చిన్నాభిన్నం చేసే ప్లాస్టిక్ ని నిషేధిస్తేనే ముందు తరాలు మనగలుగుతాయన్న సందేశాన్ని 'మెత్తని విషము' శీర్షికన అందించిన తీరు అభినందనీయం.

**"కలికాలం సోపతుల్లో అహంకారాలు**
**నాది నాది అనే అహాలు**
**బాగా బతికితే ఏడ్దరు**
**చెడిపోతే నగుతరు**
**లోకం తీరు చూస్తే**
**అన్యాయం రాజ్యమేలేత్తుంది**



ప్రతులకు:
గంగా జమున దడివె
సెల్:: 9603607962

**నీవేమో ఎడ్డిగోజవి**
**జర జాగ్రత్త బిడ్డ"**

కవయిత్రి రాసిన **'జర జాగ్రత్త బిడ్డ'** కవిత చదువుతుంటే శ్రీశ్రీ రాసిన కవిత్వంలో వాక్యాలు గుర్తుకొస్తాయి.

**"నిప్పులు చిమ్ముకుంటూ**
**నింగికి నే నెగిరిపోతే,**
**నిబిడాశ్చర్యంతో వీరు**
**నెత్తురు కక్కుకుంటూ**
**నేలకు నే రాలిపోతే**
**నిర్దాక్షిణ్యంగా వీరే"**

ఈ సమాజంలో వ్యక్తి ఉన్నతంగా బతికినా, చెడి అధమ స్థానంలో ఉన్నా రెండు స్థితులలోనూ సమాజం స్పందించే తీరును గర్హిస్తూ.. నాలుగొద్దుల అంగడిది, జీవించిన ఈ కొద్దికాలంలో జాగ్రత్తగా ఉండాలని, సమాజం రెండు వైపులా పదును తేలిన కత్తి యని ప్రకటిస్తూ ప్రతి ఒక్కరినీ జాగృత పరిచే కవిత జర జాగ్రత్త బిడ్డ.

మరొక కవిత భద్రం కొడుకోలో...

**"మనసెట్టి సోపతి సేసేటోల్లను**
**నీవంటే పయిలంగా సూసేటోళ్లను**
**ఇడసవెట్టకు కొడుకో"** అంటూ సున్నితంగా సుభాషితాన్నందించారు.

**"తరాల వారధి మాతృత్వ గర్భగుడి నుంచి**
**బాలికలను జగతిని చూడనిద్దాం"** అంటూ రేపటి తల్లికి స్వాగత వచనాలు పలికింది.

**"పుట్టింట ఉన్నప్పుడు**
**తండ్రి చాటు బిడ్డ**
**ఎదిగాక అన్న చాటు చెల్లె**
**పెళ్లయ్యాక భర్త చాటు భార్య**
**చదువుల తల్లి సరస్వతి**
**శక్తియుక్తి స్వరూపిణి పార్వతి**
**సిరులు కురిపించే శ్రీలక్ష్మి**
**అయినా మారదు ఆడపిల్ల జీవనము**
**అంతరిక్షంలో అడుగిడినా**
**ఉన్నత శిఖరాలను అధిరోహించిన వనిత"** గా అభివర్ణించారు . ఇంకా మార్పు రావా లని అభిలషించారు.

**"పొత్తిళ్లలో బరువును**
**బాధ్యతగా భావించే అమ్మ"**ను మాదేవతగా

**"తరాల వారధియై త్యాగనిరతితో సాగుతూ**
**చూపుడు వేలు దిక్సూచిగా మార్చి దారి చూపేను నాన్న"** ను నడిపించే దైవంగా

"మస్తిష్క మేధోసంపత్తికి
వీరే కదా పరమావధులు" దార్శనికు లుగా గురువులను స్తుతిస్తూ మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవయని ప్రకటించారు.

ప్రతి ఒక్కరు ఈ ముగ్గురిని తప్పనిసరిగా గుర్తుంచుకోవాలని వారి పట్ల కృతజ్ఞతా భావంతో మెలగాలని తెలిపారు.

"కమ్మదనం, తెగువ, రాజసం
యాస ఏదైనా అమ్మదనం తెలుపు తెలుగు భాష" గొప్పతనాన్ని తెలుగు భాష పట్ల తనకున్న ప్రేమను మధురాతి మధురం శీర్షికన వ్యక్తపరిచారు.

**"చేసిన అవమానాలను**
**నేను ఎదగడానికి సోపానాలుగా చేసుకొని**
**ముందుకు సాగుతానం"టూ** యువతకు **'విజయ శిఖరము'** కవిత ద్వారా స్ఫూర్తిని అందించారు.

**"బిడ్డ నీతిగా బ్రతుకు అదే బర్కతిస్తది**
**నిన్ను నిలబెడుతుంది నీ రెక్కల కట్టం"** అంటూ **'ఆయి చెప్పినముచ్చట్లు'** కవితలో అందించిన సుద్దులు అందరికీ ఆచరణ యోగ్యాలు.

**"పడి లేచే కెరటమే నీ ధైర్యమై ముందుకు నడిచే రైతు"** ను పుడమి పుత్రుడిగా భావించి ,పచ్చని చంద్రుడితో పోల్చడం బాగుంది.

**"మానవత్వం సూర్యరశ్మిలా**
**ప్రేమ భావం మలయమారుతంలా ల**
**మానవ లోకాన్ని అలుముకోవాలి**
**జీవితాల్లో చిరునవ్వులు చిందాలి"** యని ఆశాభావాన్ని వ్యక్తం చేస్తూ

"కించిత్తు స్వార్థం వదిలితే చాలు
మనిషిలో మాధవుడే కనబడున" ని చక్కని పరిష్కారం కూడా సూచించారు 'చిటికెడు మానవత్వం' కవితలో.

"కార్యనిర్వహణాధికారం స్వార్థపూరితమైతే
బ్రతుకు తెరువు కరువైన రక్కసి సమాజం" జనిస్తుందని

**"శ్రమజీవుల హక్కులు కాలరాసే**
**పెత్తందారీల ఆధిపత్య ధోరణులు"** విప్లవానికి నాంది పలుకుతాయని,

**"గుండెల్లో మంటలు తిరుగుబాటై జ్వలించుతూ**
**సమాజ సమభావుల అమృత సిద్దే విప్లవంగా రూపొందుతుంద"** ని సమ సమాజం కవితలో విశదపరిచారు.

పల్లెల్లో ఆధునీకరణ తెచ్చిన మార్పు లను మా పల్లె ప్రకృతి కవితలో వివరిస్తూ...

**"మానవుడు చేసిన తప్పుల పర్యవసానం కలుషితమైన పర్యావరణము"** ని నొక్కి చెప్పారు.

ఇంకా ఈ కవితా సంపుటిలో

**"అమ్మాయి పెళ్లిలో కన్నవారికి సంబరం కన్న**
**వరుడికి రంగు నోట్లు అందించే ఆరాటం మిన్న"** యంటూ వరకట్నంపై, సంక్రాంతి పండుగ శోభను పరిచయం చేసారు. మన పల్లెలు - సంక్రాంతి కవితా, జ్యోతిరావు పూలే, కాళోజీ, సినారేలపై స్మృతి కవిత్వం చోటుచేసుకున్నాయి.

కుటుంబాన్ని పోషించడం కోసం విదేశాలకు వెళ్ళిన నాన్న ఇంటికి వచ్చినపుడు కలిగే ఆనందంకన్నా మరొకటి ఉండదు... ఆయన ఉన్నన్ని రోజులు ఇట్టే గడిచిపోతాయి. తండ్రి తిరిగి ప్రయాణమౌతుంటే ఆ 'పసి హృదయం'లోని వేదనని వర్ణించిన తీరు మనసును ద్రవీభవించేలా చేస్తుంది.

కాసుల వర్షం స్నేహబంధాన్ని తెంచేసిన వైనాన్ని తెలుపుతూ ఔను...ఓడిపోయాను కవితలో ధనప్రభావాన్ని మన ముందుంచారు.

కవయిత్రి గంగా జమున దడివె మొదటి కవితా సంపుటి ఐనా చక్కని పదాలతో, పొందికైన మాటలతో చెప్పదలచుకున్న విషయాన్ని నాటిగా చెప్పడానికి ప్రయత్నించారు.

మరింతగా కవిత్వ రచనలో మెళకువలు నేర్చుకుని సాహిత్యంలో ముందుకు వెళతారని ఆశిద్దాం



- వైరాగ్యం ప్రభాకర్
9014559059

# నిన్ను నీవు తెలుసుకో

నీ హృదయదర్పణం పై దుమ్ముపడ్డది
నీకు నీ గమ్యం సరిగ్గా కన్పించడం లేదు
దర్పణం తుడిచే ప్రయత్నం చేసుకో
నిన్ను నీవు తెలుసుకో,ముందుకు సాగిపో
నీ మేధోసూర్యునిపై అసమర్థతా
మబ్బులు కమ్మాయి
నీలోని సమర్థతా ప్రభంజనాన్ని
నిద్రలేపు మబ్బుల్ని
తరిమికొట్టు,
నీలో వెలుగును నింపుకో
ఆత్మ నివాసమున్న
నీ శరీరం
పరిశుభ్రంగా వుండాలి
ఆధ్యాత్మిక సాధనతో
నీ బాహ్యాంతర శుభ్రత పెంచుకో
నీ ఆత్మపై అజ్ఞానాంధకారం
దాడిచేస్తోంది,జ్ఞానఖడ్గం ధరించు
అంధకారంపై గెలుపును సాధించుకో
నీకు దొరికిన గెలుపును,నీ కీర్తిని
నీ అహంకారం ముంచేస్తోంది,
మేలుకో మంచిగా మసలుకో
ప్రవర్తనలో వినయం చూపించు
అహంపై గెలుపును సాధించుకో
ఆశ నీపై దాడిచేస్తే
లంచాలకు లొంగకు,
నీ సత్ప్రవర్తనతో
నీవే అందరికి ఆదర్శమనిపించుకో
నీ మంచి కర్మలే,
నీకు శాంతినిస్తాయని తెలుసుకో
మంచిని కోరుకో,మనశ్శాంతిని పెంచుకో
మంచిగా మసలుకో,నిన్ను నీవు తెలుసుకో



-ఎస్ .ఎమ్ .షరీఫ్
సెల్:9618045319

# అనంత నిశ్శబ్దం నుంచి వచ్చిన మాట

జలపాతాలు ఉరుకుతున్నాయి
నదులు పొంగుతున్నాయి.
మానవ జీవితం సంక్షోభితం అయ్యింది
రాజ్యాధికారం కోసం భారతం బీటలువారుతుంది
ఓటరు సరుకయ్యాడు అందరు రేట్లు నిర్ణయిస్తున్నారు
గొర్రెలు కాసేవాడు కొండ అంచునే నిలబడ్డాడు
అతనికి ప్రతినిధి సింహాసనం కోసం యుద్ధంలో ఉన్నాడు
భారతదేశంలో భౌగోళిక స్వరూపం,
సాంస్కృతిక స్వరూపం రెండూ ఘర్షిస్తున్నాయి
ప్రాంతీయ అస్తిత్వం బలపడుతూ ఉంది
ఆ స్వరంలో కూడా కులం ఉంది
భూమి అంతర్గతంగా కలుషితం అవుతుంది
మంచి నీరు కార్పొరేట్ వశం అయింది
గాలి, నీరు కలుషితం అయ్యాక
ఆరోగ్యం ఒక ప్రశ్నగా మారింది!
ఔషధం కూడా శరీర రుగ్మతకు కారణమౌతుంది
మనిషి మెల్లగా తరిగిపోతున్నాడు
రోబోలా జీవించే సరళి ముందుకు వస్తుంది
పాఠం డిజిటలైయింది
మెదడుకు మనసుకు మధ్య బంధం తెగింది
విద్యార్థి ప్రతిభ కంటే
చేతిలో ఉన్న రంగుల వలయానికే
ఆకర్షితుడవుతున్నాడు
రూపాయి పెట్టుబడితో అదే రూపాయి కోసం చదువు
విద్య జ్ఞానం కోసం కాక
పెట్టుబడి, లాభంగా మారింది
తత్వం, జ్ఞానం, అభ్యసనం, అధ్యయనం, అవగాహన
బోధనలో మృగ్యం అవుతున్నాయి
వాహనాలు పెరిగేకొద్ది
కాలుష్యభూతం పట్టణాలను రుజగ్రస్థం చేస్తుంది
కోట్ల మందికి గుడిసె లేదు
కోట్లు ఖరీదు చేసే విల్లాల్లో
కుక్కలను, పిల్లలను కలిపి పెంచుతున్నారు
మాట్లలో కూడా మృదుత్వం తగ్గింది
వాచాలత్వం పెరిగింది
భాష పుట్లుకలో సృజనం ఉంది
వాడుకలో ఆధిపత్యం కనిపిస్తుంది
రోజూ రోడ్లన్నీ రక్తసిక్తం
తాగుడు అలవాటు నుంచి వ్యసనాన్ని దాటింది
మనుషులు మత్తులో రెండుగా వైరుధ్యభరితం అవుతున్నారు
చేపను చీలిస్తే కడుపులో ప్లాస్టిక్ సంచులు బయటపడ్డాయి
సింధూ నాగరికతలో కనిపించిన కుండను పగలగొట్టారు
కుండలు చేసే వాడి జీవితం ఛిద్రం అయింది
ప్లాస్టిక్ ఫాకర్టీల యజమానులు లాభపడ్డారు
మొహానికి రంగులు పూయడం కళ కాదు
కళ ఒక దృశ్య కావ్యం
చార్లీ చాప్లిన్ సిటీ లైట్స్‌లో నిశబ్ద ప్రేమను దృశ్యీకరింప చేశాడు
చలిపులి బాలింతల ఒడిలోని పిల్లలను కబళిస్తుంది
ఎన్ని తుఫానులు వచ్చినా
అర్ధరాత్రి పబ్బులు రేవ్ పార్టీలు జోరుగానే నడుస్తున్నాయి
కృత్రిమమైన జీవితానికి అక్రమ సంపాదన సోపానమైంది
అన్ని సందర్భాలలో ధనం రక్షించదు
కాస్త కరుణ, ప్రేమ, దయ, అనునయం అవసరం
కలకత్తా వీధులో ప్రతిష్టాపించిన మదర్ థెరీసా విగ్రహం
బెంగాల్‌ను పాలించిన ముఖ్యమంత్రులను మరిపిస్తుంది
క్రౌర్యాన్ని ప్రదర్శించే విగ్రహాల కన్నా
శాంతిని బోధించే సందేశకులే దేశానికి రక్ష
దేశాన్ని కులం గీతలు బహుముఖంగా చీలుస్తున్నాయి
న్యాయాధిపతి మీదే చెప్పు విసిరే చర్య
ఏ సంస్కారానికి గుర్తు?
న్యాయవాది నేరస్థుడికి రక్షకుడయ్యాడు
న్యాయ శాస్త్ర నిర్మాత విస్తుపోయి చూస్తున్నాడు
బౌద్ధంలో త్రిచరణాలు రాజ్యాంగానికి మూల శక్తులు
బౌద్ధం తరిగిపోతుంది బుద్ధి కుశలత మృగ్యమౌతుంది
జ్ఞానం అంతర్మథనం నుంచి వస్తుంది
మనోవిశ్లేషణను కోల్పోయిన మనుషులు
నిరంతరం వాచాకులుగానే మిగిలిపోతారు
దుఃఖం మనిషికి ఒక గొప్ప అనుభవం
అనంత నిశబ్దం నుంచి వచ్చిన శబ్దంలో
అక్షర దీప్తే కాదు అర్థ విన్యాసం ఉంటుంది
బ్యాంకులలో డబ్బులు ఎగ్గొట్టిన వారంతా
ఇతర దేశాలలో విహారం చేస్తున్నారు.
రాజ్యం ప్రజలకు అర్థం కావడంలేదు
ఉచితాలన్నీ అనుచితంగా సంపాదించిన నగదు నుంచే వస్తున్నాయి
ఒక స్త్రీకి 4000 తో మఖ్య పెట్టేకంటే
ఒక ఎకరం భూమి ఇస్తే మంచిదని అంబేడ్కర్ చెప్పాడు
ఓటర్ లిస్టులో ఉన్న కోట్లాది మంది స్త్రీలకు ఇళ్ళ స్థలం లేదు
రూపాయి కాగితం విలువ తగ్గుతుంది
భూమి రేటు పెరుగుతుంది
భూమిని పాలించే వాడినే భూధరుడు అన్నారు
ఇప్పుడు భూమిని తాకట్టు పెట్టేవారే పాలకులౌతున్నారు
రాజ్యమైనా, ప్రజలైనా, మనిషైనా వివేచనకోల్పోతే సరుకులౌతారు
ఇప్పుడు చిన్న దేశాలను పెద్ద దేశాలు కబళిస్తున్నాయి
రేపు పెద్ద దేశాల మధ్య కూడా యుద్ధం జరుగుతుంది
ధాన్యం పండించడం కంటే
ఆయుధ కొనుగోలుకే దేశాలు ఎక్కువ ఖర్చు చేస్తున్నాయి
సింహాసన సాధన ఒక ప్రహసనం అయింది
అనేక వైరుధ్యాల నుంచి ఒక ఎన్నిక
దేశం కులం మతం ఊబిలో కూరుకుపోయింది
వ్యక్తి స్వార్థ జీవన సంక్షోభంలో ఇరుక్కుపోయాడు
మానవ జీవనానికి మళ్ళీ తథాగతమే మార్గం...?



-డా॥కత్తి పద్మారావు
9849741695

# తెలుగు నాటక సమగ్ర చరిత్ర రావాలి

## - ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమి చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ

హైదరాబాద్, అక్టోబర్ 29: (నేటినిజం ప్రతినిధి):ఎందరో మహానుభావులు తెలుగు నాటక



'కళా' ప్రత్యేక సంచిక ఆవిష్కరిస్తున్న అతిథులు.

రంగంలో విశేష కృషి చేశారని, వారందరి జీవన చిత్రాలు చరిత్రలో నిలిచిపోయేలా, భావి తరాలకు మార్గ దర్శకంగా ఉండేలా సమగ్ర గ్రంథం తీసుకు రావలసిన అవసరం ఉందని ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమి చైర్మన్ కళారత్న గుమ్మడి గోపాలకృష్ణ తెలిపారు. గుంటూరు బృందావనం శ్రీ వెంకటేశ్వర స్వామి ప్రాంగణం లోని పద్మావతి మందిరంలో సోమ వారం సాయంత్రం యువకళా వాహిని, కళావిపంచి సంయుక్త ఆధ్వర్యంలో బొప్పన నరసింహారావు (బుజ్జి) 69వ పుట్టినరోజు వేడుకలు, బొప్పన ఆత్మీయ పురస్కారాల ప్రదానోత్సవం కనుల పండువగా జరిగింది. తెలంగాణ సారస్వత పరిషత్ ప్రధాన కార్యదర్శి, తెలుగు విశ్వ విద్యాలయం పూర్వ ప్రజా సంబంధాల అధికారి డా. జుర్రు చెన్నయ్యను కళావిపంచి సాహిత్య పురస్కారంతో ఘనంగా సత్కరించారు. అలాగే సాంస్కృతిక కళా వారధులు జి. మల్లికార్జునరావు, జమలాపురం రాధాకృష్ణ లను బొప్పన ఆత్మీయ పురస్కారాలతో సన్మానించారు.

ముఖ్య అతిథిగా విచ్చేసిన గుమ్మడి గోపాలకృష్ణ మాట్లాడుతూ తెలుగు నాటక రంగ వికాసం కోసం బృహత్ ప్రణాళిక రూపొందించామని, త్వరలో కార్యాచరణ ఆరంభమవు తుందని చెప్పారు. సభాధ్యక్షత వహించిన డా. మహ్మద్ రఫీ మాట్లాడుతూ బొప్పన నరసింహారావు లాంటి కళా పోషకులు ఉండటం



డా॥ జుర్రు చెన్నయ్యకు "కళా విపంచి పురస్కారం" ప్రదానం చేస్తున్న అతిథులు



'కళా' పత్రిక సంపాదకులు మహ్మరఫిని సత్కరిస్తున్న అతిథులు

వల్లనే కళలు విరాజిల్లుతున్నాయని అభినందించారు. సాంస్కృతిక తెర వెనుక కష్టపడే కళా వారధులను, కళా శ్రామికులను గుర్తించి సత్కరించడం అద్భుతంగా ఉందని ప్రశంసించారు.

ఈ వేడుకలో దేవాలయ పాలక మండలి కార్యదర్శి ఊటుకూరు నాగేశ్వరరావు, డా. రామరాజు శ్రీనివాసరావు, ఆంధ్ర నాటక పరిషత్ ప్రధాన కార్యదర్శి అన్నమనేని ప్రసాద్, కళావిపంచి అధ్యక్షులు బొప్పన నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. యువకళావాహిని అధ్యక్షులు లంక లక్ష్మీనారాయణ సభా సమన్వయం చేశారు. తొలుత ఉషోదయ ఆర్ట్స్ కత్రపాడు కళాకారులు చెరుకూరి సాంబశివరావు రచించి దర్శకత్వం వహించిన గారడీ నాటిక ప్రదర్శించారు.

### కళ పత్రిక ప్రత్యేక సంచిక విడుదల

బొప్పన నరసింహారావు 69వ పుట్టినరోజు సందర్భంగా కళ పత్రిక ప్రత్యేక సంచికను ప్రచురించింది. అదే వేదికపై ఉదయం కళ పత్రిక ప్రత్యేక సంచిక ఆవిష్కరణ మహోత్సవం నాటక కళాకారులు దర్శక ప్రయోక్తల సమక్షంలో వైభవంగా జరిగింది. కళ పత్రిక సంపాదకులు డా. మహ్మద్ రఫీ, బొప్పన నరసింహారావు లను ఘనంగా సన్మానించారు. యువకళావాహిని, కళావిపంచి, ఆరాధన ఆర్ట్స్ అకాడమి, ఎన్టీఆర్ నాటక కళా పరిషత్, వై. కె. నాగేశ్వరరావు నాటక కళా పరిషత్, నటరత్న ఎన్టీఆర్ కళా పరిషత్, ఉషోదయ కళానికేతన్ తదితర సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ సభా కార్యక్రమానికి లంక లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు.

విజయవాడ శారద కళా సమితి అధ్యక్షులు దోగిపర్తి శంకరరావు, సత్తెనపల్లి కళా పరిషత్ నూతలపాటి సాంబయ్య, గంగోత్రి పెద కాకాని నట దర్శక ప్రయోక్త నాయుడు గోపి, గుంటూరు రచయిత నట దర్శకుడు కావూరి సత్యనారాయణ, రామరాజు ఫౌండేషన్ చైర్మన్ డా. రామరాజు శ్రీనివాసరావు, హైదరాబాద్ తెలంగాణ సారస్వత పరిషత్ ప్రధాన కార్యదర్శి డా. జుర్రు చెన్నయ్య, హైదరాబాద్ మైహోమ్ అవతార్ సిటిజన్ కల్చరల్ అసోసియేషన్ జమలాపురం రాధాకృష్ణ, ఊటుకూరు నాగేశ్వరరావు, మంగళగిరి విద్యా సంస్థల అధినేత డా. వేకల మోహనరావు, నాటక రచయిత మృత్యుంజయరావు, చెరుకూరి సాంబశివరావు, ఎంవియల్ నరసింహారావు, వేమూరి ఆనంద్ మోహన్, డి. తిరుమలేశ్వరరావు, కాట్రగడ్డ రామకృష్ణ ప్రసాద్, నటి నాగరాణి, ఏలూరు డా. కొల్లి మోహనరావు, యేపూరి హరిబాబు తదితరులు పాల్గొన్నారు. భాగి శివశంకర శాస్త్రి, జి. మల్లికార్జునరావు, షేక్ జానీ బాషా సమన్వయం చేశారు. 69 మంది కళాకారులను సత్కరించారు. కళ పత్రికలో బొప్పన బుజ్జి గురించి రాసిన రచయితలను సన్మానించారు. ఆలాపన వెంకటేశ్వరరావు, రమణి, మల్లీశ్వరి బృందం సమర్పించిన భక్తి సంగీత విభావరి వీనుల విందు చేసింది.




# కన్నయ్య, కామధేనువుల పండుగ - గోపాష్టమి

హిందూస్థాన్ పవిత్ర నేల పండుగలకు నెలవు. ప్రతి పండుగ వెనుక ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, సంపూర్ణ శ్రేయస్సు దాగి ఉన్నాయని ప్రగాఢ నమ్మకం. శ్రీకృష్ణుడిని గోవర్ధనోద్ధారి అని ముద్దుగా పిలుచుకుంటున్నాం. కృష్ణుడికి గోవులంటే బహు ఇష్టం. గోపాష్టమి పుణ్య గడియల్లో శ్రీకృష్ణుడితో పాటు గోవులను పూజించే పవిత్ర పండుగ. త్రేతాయుగంలో కృష్ణుడికి తన తండ్రి నందుడు బృందావనంలోని గోవులను సంరక్షించే బాధ్యతను అప్పగించిన వేడుకగా గోపాష్టమిని అత్యంత భక్తి భావంతో నిర్వహించుకుంటున్నాం. కార్తీక మాసం శుక్ల పక్షంలో వచ్చే అష్టమి పుణ్య గడియల్లో, అనగా అక్టోబర్ 30, 2025 రోజున గోపాష్టమిని జరుపుకుంటాం. హైందవ పౌర సమాజం గోమాతను దైవంగా భావించి పూజలు చేస్తారు. ఇదే రోజు దుర్గాదేవిని కూడా ఆరాధించే బుదాష్టమి విశిష్టతను కూడా తెలుసుకోవడం జరుగుతుంది.

## గోపాష్టమి పౌరాణిక కథనం:

కార్తీక మాసం ప్రారంభంలో శుద్ధ పాడ్యమి రోజు శ్రీకృష్ణుడు గోవర్ధన పర్వతాన్ని తన చిటికెన వ్రేలుపై నిలిపి, ఇంద్రుడు కురిపించిన రాళ్ల వర్షం నుంచి ఏడు పగళ్లు, ఏడు రాత్రులు గోకులాన్ని రక్షించడంలా జరిగింది. ఎనిమిదవ రోజైన అష్టమి రోజు ఇంద్రుని గర్వం అణిచి కృష్ణ భగవానుడి శరణు వేసుకుంటాడు. ఈ శుభ సందర్భంగా కార్తీక శుక్ల అష్టమి రోజు జగన్నాథుడికి కృతజ్ఞతలను సమర్పిస్తూ గోకుల వాసులు గోపాష్టమి ఆచరించడం జరిగింది. గోపాష్టమి రోజున గోపాలుడితో పాటు గోమాతను షోడశోపచారాలతో అటుకులు, పటిక బెల్లం, ఆవు పాలు, వెన్న లాంటి నైవేద్యాలను సమర్పిస్తారు. అష్టమి తిథి దుర్గాదేవికి ఎంతో ప్రీతికరం కావడంతో ఈ రోజున దుర్గాదేవిని కూడా పూజిస్తే జీవితంలో ఎదురయ్యే ఆటంకాలు తొలగిపోతాయని ప్రగాఢంగా విశ్వసిస్తున్నాం. ఇదే రోజున బుదాష్టమిని కూడా జరుపుకుంటారు.

## గోపాలకుడు గోవులను మేపడం ప్రారంభించిన పుణ్య గడియలు:

గోపాష్టమి రోజున కన్నయ్య తొలిసారి ఆవులను మేపడం ప్రారంభించడంతో ఆ శుభ గడియలను పర్వదినం జరుపుకుంటున్నాం. కృష్ణయ్య 6 ఏండ్ల వయస్సులో ఉన్నపుడు, తాను పెద్దవాడిని అయ్యానని, గోవులను మేపేందుకు వెళతానని తల్లితండ్రులతో వేడుకోవడం, దానికి నందుడు నవ్వి ఇంకా నువ్వు చిన్న వాడివే అని గోపాలుడిని వారించాడట. కృష్ణుడు పట్టు పట్టడంతో నందుడు పండితుల వద్దకు వెళ్లి సలహా అడిగాడట. దీనికి పండితుడు స్పందించా ఈ రోజు ముహూర్తం దాటితే సంవత్సరం పాటు మంచి ముహూర్తం లేదని చెప్పాడట. దానితో తండ్రి ఒప్పుకొని గోపాష్టమి రోజు శ్రీ కృష్ణుడిని తొలిసారి గోవులను మేపడానికి పంపించాడట. ఈ విధంగా గోపాష్టమి రోజున కృష్ణుడు స్వతంత్ర గోపాలకుడు అయ్యాడు.

## కోర్కెలు తీర్చే కామధేనువు - గోమాత విశిష్టత:

పురాణాల ప్రకారం 33 కోట్ల దేవతలు ఒక్క గోవులోనే నివసించారని స్పష్టం అవుతోంది. గోమాతను లక్ష్మీ స్వరూపంగా కూడా పూజిస్తున్నాం. నవజాత శిశువు నుంచి పండు ముసలి వరకు అందరూ గో క్షీరాన్ని ఆస్వాదించి సంపూర్ణ ఆయురారోగ్యాలను పొందుతున్నారు. సకల శాస్త్రాల సారం గోమాత మాత్రమే. గోమాత తోక వైపు పసుపు కుంకుమలు చల్లి, కర్పూర హారతులు ఇచ్చి పూజలు చేస్తే అష్టైశ్వరాలు కులుగుతాయని విశ్వాసిస్తున్నాం. ఈ కారణంగా గోపాష్టమి రోజు పరమ పవిత్ర భావనలతో గోపూజ నిర్వహించడం సంప్రదాయంగా వస్తున్నది. ఆవును పరమ పవిత్ర వరంగా భావిస్తున్నాం. ఆవు నుంచి లభించే ప్రతి ఉత్పత్తికి ఒక మానవహిత ప్రయోజనం ఉంటుంది. ఆవు పాలు శారీరక శ్రేయస్సుకు దోహదపడుతున్నాయి. ఆవు విశ్వ శక్తులను గ్రహించే సూర్య కేతు నాడిని కలిగి ఉంటుందని, పసుపు రంగు ఆవు పాలు అపార ఆరోగ్య ప్రయోజనాలను కలిగి "బంగారు అమృతంగా పిలువబడుతున్నది. పాలు, వెన్న, నెయ్యి, మూత్రం, పేడ లాంటి పలు ఆవు ఉత్పత్తులు అనేక ప్రమాదకర రోగాలను నివారిస్తాయి. ఆవు ఉత్పత్తులతో పలు మందులు, సబ్బులు, షాంపూలు, లేపనాలు, క్రిములు, అందాలను పెంచే ఉత్పత్తులను తయారు చేయడమే కాకుండా ఎరువులు, పురుగు మందులను కూడా తయారు చేస్తారు. ఆవు రుద్రులకు తల్లి, వస్తువుల కుమార్తె, ఆదిత్యులకు సోదరి, అమృత నాభి అని అర్థం చేసుకొని గోమాతను రక్షించికుందాం, గో వధను వ్యతిరేకిద్దాం. ఆవు కోర్కెలు తీర్చే కామధేనువుగా పూజిద్దాం.గోమాతను పూజిస్తే అదృష్టం, సాఫల్యత, శ్రేయస్సు కలుగుతాయి. కన్నయ్యను పూజిస్తే విజయాలు, ఆయురారోగ్యాలు చేకూరుతాయి. గోమాత తన జీవితాన్ని మానవాళి సేవలకు అంకితం చేస్తున్నది. ఆవులకు పరిరక్షణ గొడుగు పట్టడం మన కనీస కర్తవ్యం. కామధేనువును కాపాడుకుంటేనే సకల స్వస్థతలు కలుగుతాయని నమ్ముదాం. గోమాతను మనసారా పూజిద్దాం.

(30 అక్టోబర్ పరమ పవిత్ర "గోపాష్టమి" పర్వదినం శుభ సందర్భంగా)

-డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# అవార్డులు కవికి బాధ్యతను పెంచుతాయి

## - తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డా॥ఏనుగు నరసింహారెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 29: (నేటినిజం ప్రతినిధి):కవులకు, రచయితలకు అవార్డులు అనేవి మరింత బాధ్యతను పెంచుతాయని తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డా.ఏనుగు నరసింహారెడ్డి అన్నారు. అక్టోబర్ 26 న మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని లిటిల్ స్కాలర్స్ హైస్కూల్ లోగల కాళోజీ హాల్ లో జరిగిన అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి కవులు కవిత్వాన్ని సీరియస్ గా రాయాలన్నారు. అలా కవిత్వం రాస్తున్న వారిలో కాంచనపల్లి ఒకరన్నారు. కాంచనపల్లి రాసిన పెంకుటిల్లు కవితాసంపుటికి పాలమూరు సాహితి అవార్డు ప్రకటించడం సరైన నిర్ణయమన్నారు. సభకు అధ్యక్షత వహించిన జిల్లా కళాకారుల సంస్థ అధ్యక్షులు, ప్రముఖ న్యాయవాది వల్లపురెడ్డి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ పాలమూరు సాహితి అవార్డును గత పదిహేనేళ్ళుగా డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్ ఇవ్వడం జిల్లాకు గర్వకారణమన్నారు. అనంతరం 2024 సంవత్సరానికిగాను ప్రముఖ కవి డాక్టర్ కాంచనపల్లి గోవర్ధన్ రాజు రచించిన "పెంకుటిల్లు" కవితాసంపుటికి పాలమూరు సాహితి అవార్డును ప్రదానం చేశారు. ఈ పురస్కారం కింద శాలువా, మెమెంటోలతో పాటు ఐదువేల నూటపదహార్ల నగదు బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా విచ్చేసిన ప్రముఖ న్యాయవాది బుర్రి వెంకట్రామిరెడ్డి, ఆత్మీయ అతిథిగా విచ్చేసిన రాష్ట్ర ప్రభుత్వ కాళోజీ అవార్డు గ్రహీత కోట్ల వెంకటేశ్వరరెడ్డిలు మాట్లాడారు. పెంకుటిల్లు పుస్తకాన్ని ప్రముఖ యువకవి బోల యాదయ్య చక్కగా సమీక్ష చేశారు. ఈ కార్యక్రమంలో పాలమూరు సాహితి అవార్డు వ్యవస్థాపకులు డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్, పి.వేంకటేశ్వరరావు, ఏపూరి కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.



కాంచనపల్లికి అవార్డును ప్రదానం చేస్తున్న అతిథులు.

# అదుపు తప్పి గుంతలోకి ఆర్టీసీ బస్సు..!

మెదక్, అక్టోబర్ 29:ఆర్టీసీ బస్సులో ప్రయాణం భద్రమని గొప్పలు చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. బస్సులు రాకపోకలు సాగించేందుకు రోడ్లు సైతం అంతే ముఖ్యమని ఎందుకు చెప్పడం లేదని మునిపల్లి మండల వాసులు కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై తీవ్రంగా మండిపడుతున్నారు. బుధవారం మండలంలోని బోడపల్లి, చిన్న చెల్మడ, ఖమ్మంపల్లి గ్రామాల మీదుగా మండల కేంద్రమైన మునిపల్లికి వెళ్లే ఆర్టీసీ బస్సుకు ఖమ్మంపల్లి గ్రామ శివారులోకి రాగానే తృటిలో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు, ప్రయాణికులు వెల్లడించారు.

ఈ సందర్భంగా స్థానికులు, ప్రయాణికులు మాట్లాడుతూ.. ఖమ్మంపల్లి-మునిపల్లి రోడ్డు పనులు ప్రారంభించి నెలలు గడుస్తున్నప్పటికీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి కాకపోవడం తోనే ప్రమాదాలు చోటు చేసుకుంటు న్నాయని స్థానికులు ప్రభుత్వ తీరుపై మండిపడుతున్నారు. బోడపల్లి చిన్న చెల్మడ, ఖమ్మంపల్లి గ్రామాల నుంచి స్కూల్ విద్యార్థులు, ప్రజలు ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేస్తున్న క్రమంలో ఖమ్మంపల్లి-మునిపల్లి మధ్య రోడ్డు బాగాలేకపోవడంతో బస్సు అదుపు తప్పి గుంతలోకి దూసుకు పోయినట్లు స్థానికులు తెలిపారు. డ్రైవర్ అప్రమత్తమై బస్సును కంట్రోల్ చేయడంతో ప్రయాణికులు బస్సు నుండి దిగి ప్రైవేట్ వాహనాల్లో వారి వారి గమ్యాలకు వెళ్లిపోయారు.

**ఆగస్టు 22న మంత్రి చేత పనులు ప్రారంభం..**

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ మునిపల్లి-ఖమ్మంపల్లి గ్రమానికి నూతన రోడ్డు నిర్మాణం పనులు ఆగస్టు 22న ప్రారంభించారు. అయితే నిర్మాణ పనులు ప్రారంభానికి పరిమితమైనవి తప్ప పనులు ప్రారంభం కాలేదు. సంబంధిత అధికారుల నిర్లక్ష్యమా.. ప్రభుత్వ నిర్లక్ష్యమా.. రోడ్డు నిర్మాణ పనులు మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్టు దర్శనమిస్తున్నాయి.

మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రత్యేక చొరవ తీసుకొని మండలం లోని గ్రామాలకు మెరుగైన రోడ్డు సౌకర్యం కలిపించేందుకు నూతన రోడ్డు నిర్మాణాలు నిర్మించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు.




# ప్రముఖ రచయిత అంబల్ల జనార్ధన్‌కు 'సహృదయ సాహితీ పురస్కారం'



హైదరాబాద్, అక్టోబర్ 29 (నేటినిజం ప్రతినిధి): దివంగత ఒద్దిరాజు సోదరకవుల స్మారకార్థం సహృదయ సాహిత్య సాంస్కృతిక సంస్థ వరంగల్ ఆధ్వర్యంలో ముంబైకి చెందిన ప్రముఖ రచయిత డాక్టర్ అంబల్ల జనార్ధన్ సహృదయ సాహితీ పురస్కారానికి ఎంపికైనట్లు సంస్థ అధ్యక్షుడు గన్నమరాజు గిరిజా మనోహరబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అంబల్ల జనార్ధన్ రచించిన "ముంబై చూపుతో తెలుగు కథానికలు" కథా సంకలనాన్ని న్యాయ నిర్ణేతలు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు.**నవంబర్ 15న** జరగనున్న సహృదయ వార్షికోత్సవ సభలో ఈ ప్రతిష్ఠాత్మకమైన పురస్కారాన్ని జనార్ధన్ అందుకోనున్నారు.




Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com